ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శుక్రవారం | 09-10- 2026 | సంపుటి: 17, సంచిక: 188, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

## జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల

# ప్రయోజనాలు కాపాడాలి

- నిజాయితీ పన్నుదారులకు సులభమైన విధానం.. పన్ను మోసాలపై కఠిన చర్యలు
- తెలంగాణకు ఏటా రూ.800 కోట్లకుపైగా ఆదాయ ప్రభావం.. మరింత ఆర్థిక నష్టం జరిగే అవకాశం
- హైదరాబాద్‌లో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి
- స్కామ్ రంగం, గుర్తింపు దొంగతనాలపై మంత్రుల బృందం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన




న్యూఢిల్లీ, అక్టోబర్ 8: జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తూనే రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు కేంద్రాన్ని కోరారు. 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. నిజాయితీగా పన్నులు చెల్లించే వారికి అనుసరణ ప్రక్రియను సరళీకరించడంతో పాటు, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడే వారిపై జీరో టాలరెన్స్ విధానం కొనసాగాలని స్పష్టం చేశారు. జీఎస్టీ అమలుకు పునాది పరస్పర విశ్వాసమేనని భట్టి పేర్కొన్నారు. ఉమ్మడి జాతీయ మార్కెట్ ఏర్పాటుతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్న నమ్మకంతో రాష్ట్రాలు తమ స్వతంత్ర పన్ను విధించే అధికారంలో గణనీయమైన భాగాన్ని వదులుకున్నాయని గుర్తుచేశారు. కేంద్రం, రాష్ట్రాలు భాగస్వాములుగా పనిచేయడం, రాష్ట్రాల ఆదాయాన్ని కాపాడటం, కీలక మార్పులను సంప్రదింపులు, ఏకాభిప్రాయంతో చేపట్టడం ఈ వ్యవస్థకు మూల సూత్రాలని అన్నారు.

**తెలంగాణపై జీఎస్టీ ప్రభావం**

తెలంగాణ సొంత పన్ను ఆదాయంలో జీఎస్టీ వాటా సుమారు 35 శాతం ఉందని భట్టి తెలిపారు. ఈ ఆదాయంతోనే రాష్ట్రంలో పాఠశాలలు, ఆసుపత్రులు, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలకు నిధులు సమకూరుతున్నాయని చెప్పారు. జీఎస్టీ ఆదాయంలో తగ్గుదల కేవలం లెక్కల అంశం కాదని, ప్రజలకు సేవలు అందించే రాష్ట్ర సామర్థ్యంపై నేరుగా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మోటార్ వాహనాలు, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌పుట్ సర్వీసుల రీఫండ్‌లకు సంబంధించిన మార్పులు చేపట్టే ముందు వాటి పూర్తి ఆర్థిక ప్రభావాన్ని రాష్ట్రాలకు వివరించాలని కోరారు. మోటార్ వాహనాల విషయంలో కేంద్రం అందించిన అంచనాల ప్రకారం తెలంగాణకు ఏడాదికి

తరువాయి 2వ పేజీలో...



## ఓటు బచావో..

# దేశ్ బచావో..

### 13 కోట్ల ఓట్లు ఎలా గల్లంతయ్యాయి? : సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, అక్టోబరు 8: “ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు ఇకపై బీజేపీ ప్రభుత్వాన్ని ఎంతమాత్రం రక్షించలేవు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తప్పించాలి. లేకపోతే, ప్రధాని మోదీ తన గద్దెను ఖాళీ చేయాలి. అలా చేయకపోతే ప్రజలే ఆయనను గద్దె దించుతారు” అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల సంఘాన్ని అడ్డు పెట్టుకుని దొడ్డిదారిన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తే ప్రజలు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. ‘ఓట్ బచావో.. దేశ్ బచావో’ ఉద్యమంలో భాగంగా విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, ఇండియా కూటమి నేతలు గురువారం మహాత్మా గాంధీ సమాధి రాజ్‌ఘాట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అందులో పాల్గొన్న సీఎం రేవంత్.. రాజ్‌ఘాట్ వద్ద నివాళుల అనంతరం విలేకరులతో మాట్లాడారు. ‘ఓట్ బచావో.. దేశ్ బచావో’ ఉద్యమం కాంగ్రెస్ పార్టీ కోసమో, ఇండియా కూటమి కోసమో కాదని, దేశంలోని సామాన్యుల హక్కుల పరిరక్షణ ఉద్యమమని చెప్పారు. “2014లో మోదీ ప్రధాని అయినప్పుడు దేశంలో 81 కోట్ల ఓట్లు ఉన్నాయి.

తరువాయి 2వ పేజీలో...

### విదేశాల్లోనూ వెలుగుతున్న తెలంగాణ సంస్కృతి

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



స్విట్జర్లాండ్-అక్టోబర్ 8: విదేశాల్లో స్థిరపడినా మాతృభాషను, మన సంస్కృతి, సాంప్రదాయాలను మరువకుండా కాపాడుతుండడం అందరూ హర్షించదగ్గ విషయమని తెలంగాణ శాసనసభ సభాపతి (స్పీకర్) గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. చిన్న పిల్లలకు తెలుగు భాష నేర్పిస్తూ, బతుకమ్మ, బోనాలు వంటి ఉత్సవాలను నిర్వహిస్తూ భాషా సంస్కృతిని స్విట్జర్లాండ్ లో ఇనుమడింపజేయడం భావితరాలకు ఆదర్శమన్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన విదేశీ అధ్యయన పర్యటనలో భాగంగా తెలంగాణ శాసన వ్యవస్థ ప్రతినిధుల బృందం స్విట్జర్లాండ్ లోని బెర్న్ సిటీలో పర్యటించింది. స్పీకర్ గారి మిత్రులు శ్రీ బ్రహ్మానంద రెడ్డి బావిగడ్డ గారి ఆహ్వానం మేరకు అక్కడి ప్రవాస తెలుగు భారతీయులతో భేటీ అయ్యారు.

తరువాయి 2వ పేజీలో...

### ఈ-హెచ్‌ఆర్ఎంఎస్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల

# పూర్తి డిజిటల్ డేటా నమోదు

**అక్టోబర్ 15 నాటికి డిజిటల్ రికార్డుల ప్రక్రియ పూర్తి చేయాలి**
**భవిష్యత్‌లో ప్రభుత్వ అనుమతులు, ఉత్తర్వులు పూర్తిగా డిజిటల్ విధానంలోనే**
**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



హైదరాబాద్, అక్టోబరు 8 (ప్రజాకలం) :

రాష్ట్రంలో మరింత పారదర్శక పరిపాలన అందించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఈ-హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ లో పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఈ-హెచ్‌ఆర్ఎంఎస్ అమలు, ప్రభుత్వ శాఖల్లో డిజిటల్ విధానాలపై అన్ని శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

తరువాయి 2వ పేజీలో...

### వ్యవసాయ యాంత్రీకరణ పథకం

# ప్రారంభానికి రాష్ట్రం సిద్ధం

**రాష్ట్ర, కేంద్ర వాటాలతో వ్యవసాయ యాంత్రీకరణ పథకం**

**లబ్ధిదారుల ఎంపికపై కేంద్ర మార్గదర్శకాల కోసం ఎదురుచూపులు**

**చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరేలా వ్యవసాయ యాంత్రీకరణ పథకం: మంత్రి తుమ్మల**



హైదరాబాద్, అక్టోబరు 8 (ప్రజాకలం) :


గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పక్కన పెట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2025-26 సంవత్సరం నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించి అమలు చేస్తున్నామని చెప్పారు. 2025-26 సంవత్సరానికి పథకం కోసం రూ.71 కోట్లు కేటాయించగా, రూ.63 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...


## కలం కౌంటర్




ఆత్మీయ ఆహ్వానం
సరికొత్త ఫ్యాషన్ ప్రపంచం ఇప్పుడు మన నల్గొండలో



తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు & సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు
శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి
చేతులమీదుగా
ఈరోజే
ఉ.10.30 ని.లకు
గొప్ప ప్రారంభం
ముఖ్య నేతలకు, జిల్లా అధికారులకు
కస్టమర్ దేవుళ్ళకు
ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం




అత్యద్భుత ప్రారంభోత్సవ ఆఫర్స్
అస్సలు మిస్సవ్వకండి
శారీస్ | ఉమెన్స్‌వేర్ | మెన్స్‌వేర్ | కిడ్స్‌వేర్


ఎన్.టి.ఆర్. విగ్రహం దగ్గర, హైదరాబాద్ రోడ్, నల్గొండ

# ఓటు బచావో.. దేశ్ బచావో..

మొదటి పేజీ తరువాయి...

2019 నాటికి 91 కోట్లకు, 2024 నాటికి 97 కోట్లకు చేరాయి. కానీ, 2029 ఎన్నికలనాటికి ఏకంగా 13 కోట్ల ఓట్లు తొలగిస్తున్నారు. జనాభా పెరిగితే ఓట్లు పెరగాలి. కానీ, ఇలా తగ్గించడం ఏమిటి?" అని నిలదీశారు. ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించుకున్నామని, ప్రజల సగటు ఆయుర్ధాయం పెరిగిందని, అయినా, దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లను తొలగించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఓట్లు ఎందుకు తగ్గాయో ప్రధాని మోదీ దేశ ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే వారి ఓట్లను టార్గెట్ చేసి తొలగిస్తున్నారని, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ వాట్సాప్, సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నవారే వారి లక్ష్యమని మండిపడ్డారు. కేవలం మోదీజీకి అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే ఓటు హక్కు ఉండేలా కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.

**ఓటు హక్కును గుంజుకునే కుట్ర**

సంపన్నులు, పేదలనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ అంబేడ్కర్ ఓటు హక్కు కల్పించారని, ఇప్పటి వరకూ ఎన్నిసార్లు 'సర్' జరిగినా పేదల ఓట్లకు ముప్పు కలగలేదని, ఇప్పుడు అణగారిన వర్గాల నుంచి ఓటు హక్కును గుంజుకునేందుకు ప్రధాని మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రయత్నిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. "ఎన్నికల సంఘం తప్పులను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై పోలీసులతో దాడులు చేయించడం, ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన నేతలను ఎన్నికల సంఘం కలవకపోవడం వెనక పెద్ద కుట్ర దాగి ఉంది. కులం, మతం, ప్రాంతం, భాషల పేరుతో దేశ ప్రజలను విభజించి బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు ఓటు ఉన్న వాళ్లు, లేనివాళ్లు అనే రెండు వర్గాలుగా దేశ ప్రజలను విభజిస్తున్నారు. బీజేపీకి అనుకూలంగా ఉన్నవాళ్లు ఒకవైపు, వ్యతిరేకంగా ఉన్న పేదలు మరో వైపు అన్నట్లు పరిస్థితులను మోదీ, జ్ఞానేష్ కుమార్ మార్చారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా తీర్పునిచ్చే దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనారిటీ ఓటర్లను లక్ష్యంగా చేసుకొని తొలగిస్తున్నారని ఆరోపించారు.

**యూపీఏ పాలనలోనే యూపీఏ సేవలు: సీఎం**

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎప్పుడూ డిజిటైజేషన్, ఆధునికీకరణకు ప్రాధాన్యతనిచ్చాయని సీఎం రేవంత్ తెలిపారు. మొబైల్ ఆధారిత డిజిటల్ చెల్లింపుల మౌలిక వ్యవస్థను 2012-13లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ-2 ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఎక్స్‌లో పేర్కొన్నారు.

**ప్రజాస్వామ్యంపై దాడిని సహించేది లేదు: భట్టి**

ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, నేరుగా ప్రజాస్వామ్యంపైనే దాడి జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహిస్తున్నామనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించడమే ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యతని, కానీ, ఇప్పుడు ప్రతి ఓటరూ ఈసీ తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తప్పుబట్టారు. లోపాలు జరుగుతున్నాయని సొంత ఎన్నికల సంఘం సభ్యులే అంగీకరిస్తున్నప్పుడు, పారదర్శకతను నిరూపించుకోవాల్సిన బాధ్యత సీఈసీపైనే ఉందని చెప్పారు. లోపాలను సరిదిద్దాల్సింది పోయి ప్రతిపక్షాలు, రాహుల్ గాంధీ అబద్ధాలు చెబుతున్నారంటూ ప్రెస్ నోట్‌లు విడుదల చేయడం సరికాదని మండిపడ్డారు.

### ఈ-హెచ్ఆర్ఎంఎస్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల
# పూర్తి డిజిటల్ డేటా నమోదు

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వ ఉద్యోగుల నియామకం, సర్వీస్ రికార్డులు, జీతభత్యాలు, పదోన్నతులు, ఏసీఆర్‌లు, ఇతర ఉద్యోగ సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపై అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో సుమారు 3.48 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన డేటాను ఈ-హెచ్ఆర్ఎంఎస్‌లో నమోదు చేస్తున్నట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు. మొత్తం 38,710 కార్యాలయాలకు సంబంధించిన డేటాలో ఇప్పటికే సుమారు 93 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన ప్రక్రియను అక్టోబర్ 15 నాటికి పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

భవిష్యత్‌లో డిజిటల్ అనుమతులకే ప్రాధాన్యం

ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత, వేగం, సామర్థ్యాన్ని పెంచేందుకు భవిష్యత్‌లో అన్ని రకాల ప్రభుత్వ అనుమతులు, ఉత్తర్వులను సాధ్యమైనంత వరకు డిజిటల్ విధానంలోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. ఆర్థిక శాఖకు సంబంధించిన ఈ-సాంక్షన్ ఉత్తర్వులను పూర్తిగా డిజిటల్ విధానంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక సేవలు, మంజూరులు, చెల్లింపులకు సంబంధించిన ప్రక్రియలను ఆన్‌లైన్‌లో నిర్వహించేలా వ్యవస్థలను సమన్వయం చేయాలని సూచించారు.

పనులన్నీ ఆన్‌లైన్‌లోనే

ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించిన సాంకేతిక అనుమతుల ప్రక్రియను కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని సీఎస్ తెలిపారు. అసిస్టెంట్ ఇంజనీర్ నుంచి చీఫ్ ఇంజనీర్ వరకు సాంకేతిక అనుమతుల ప్రక్రియను డిజిటల్ విధానంలో చేపట్టాలని సూచించారు. అదేవిధంగా, లబ్ధిదారులకు నేరుగా అందించే మంజూరులను ఆధార్ ఆధారిత ధృవీకరణతో పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

డిజిటల్ పరిపాలనకు నోడల్ అధికారులు

ఈ-హెచ్ఆర్ఎంఎస్‌తో పాటు అన్ని డిజిటల్ విధానాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రతి శాఖలో నోడల్ అధికారిని నియమించాలని సీఎస్ సూచించారు. డిజిటల్ వ్యవస్థల అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేలా శాఖల వారీగా సమన్వయం ఉండాలని తెలిపారు. ప్రభుత్వ సేవలను వేగవంతం చేయడంతో పాటు Ease of Doing Businessకు మరింత ఊతమిచ్చేలా డిజిటల్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ లు బి.ఎం.డి.ఎక్కా, సభ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, అహ్మద్ నదీం, క్రిస్టినా చొంగ్తూ, శిఖాగోయల్, కార్యదర్శులు గౌరవ్ ఉప్పల్, లోకేష్ కుమార్, దివ్య దేవరాజన్, సురేంద్ర మోహన్, హరిచందన, ఇ. శ్రీధర్, సిక్తాపట్నాయక్, విజయేంద్ర, సమాచార, పౌరసంబంధాల స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలి

మొదటి పేజీ తరువాయి...

సుమారు రూ.800 కోట్ల ఆదాయ ప్రభావం ఉంటుందని, రాష్ట్ర సొంత అంచనాల ప్రకారం ఈ నష్టం అంతకంటే రెట్టింపు కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. తగిన సందర్భాల్లో ఆటోమేటిక్ జీఎస్టీ రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ మార్పులు, రద్దు దరఖాస్తుల ఆటోమేటిక్ ప్రాసెసింగ్‌కు భట్టి మద్దతు తెలిపారు. రిస్క్ లేని కేసుల్లో ఆటోమేటిక్‌గా రీఫండ్‌లు మంజూరు చేయడం ద్వారా నిజాయితీగల పన్నుదారులకు త్వరగా ప్రయోజనం అందుతుందని అన్నారు. అదే సమయంలో అధిక రిస్క్ ఉన్న కేసులపై పన్ను అధికారులు మరింత దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. పెనాల్టీలను హేతుబద్ధీకరించడం, రహదారులపై సరుకుల వాహనాలను యాదృచ్ఛికంగా నిలిపివేయడాన్ని తగ్గించడం వంటి చర్యలను స్వాగతించారు. జీఎస్టీ రిటర్నుల్లో అవసరమైన మార్పులు చేసి పన్ను వివరాల్లో తేడాలను తగ్గించాలని, నిజాయితీగల పన్నుదారులకు అనవసర నోటీసులు జారీ కాకుండా చూడాలని సూచించారు. జీఎస్టీ అమలులో స్పష్టత, ఏకరూపత కోసం తగిన సర్క్యులర్లు, వివరణలు జారీ చేయాలని కోరారు.

**నకిలీ రిజిస్ట్రేషన్లపై ఉక్కుపాదం**

పన్నుదారులకు అనుకూలమైన విధానాలను అమలు చేయడంతో పాటు జీఎస్టీ మోసాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు, గుర్తింపు వివరాల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని భట్టి డిమాండ్ చేశారు. వృద్ధులు, గృహిణులు, రోజువారీ కూలీలు, ఇతర అమాయకుల ఆధార్, పాన్ వివరాలను దుర్వినియోగం చేసి మోసపూరిత జీఎస్టీ రిజిస్ట్రేషన్లు సృష్టిస్తున్న ఘటనలను ప్రస్తావించారు. నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించడం, అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందడం లేదా ఇతరులకు బదిలీ చేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులు, వ్యవస్థీకృత ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విధానాలను సరళీకరించడం పేరుతో వ్యవస్థీకృత పన్ను ఎగవేతపై అమలు చర్యలు బలహీనపడకూడదని స్పష్టం చేశారు.

**స్క్రాప్ రంగంపై ప్రత్యేక దృష్టి**

దేశవ్యాప్తంగా స్క్రాప్ రంగంలో జరుగుతున్న పన్ను ఎగవేతను భట్టి ప్రస్తావించారు. అసంఘటిత, నగదు ఆధారిత వ్యవస్థ కారణంగా నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించడం, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ బదిలీ చేయడం జరుగుతోందని చెప్పారు. అదే సమయంలో ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న చెత్త సేకరించే కార్మికులు, చిన్న స్థాయి సేకరణదారుల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. స్క్రాప్ రంగం, గుర్తింపు దొంగతనం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి, పేద ప్రజల ప్రయోజనాలను కాపాడే కార్యాచరణను రూపొందించేందుకు జీఎస్టీ కౌన్సిల్ మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రతిపాదించింది. దేశంలో అత్యంత చురుకైన పన్ను ఆధారాల్లో తెలంగాణ ఒకటని భట్టి అన్నారు. అయితే చాలా కాలంగా అధికారుల కమిటీల్లో తెలంగాణకు తగిన ప్రాతినిధ్యం లభించలేదని పేర్కొన్నారు. జీఎస్టీ కౌన్సిల్ పునర్వ్యవస్థీకరించే కమిటీల్లో తెలంగాణకు సభ్యత్వం కల్పించాలని కోరారు. స్టాండింగ్ కమిటీ ఆఫ్ ఆఫీసర్స్‌లోనూ తెలంగాణకు ప్రాతినిధ్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**హైదరాబాద్‌లో జీఎస్టీ ప్రాంతీయ కార్యాలయాలు**

హైదరాబాద్ కేవలం భౌగోళికంగా అనుకూలమైన నగరం మాత్రమే కాదని, టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో దేశంలోని ప్రముఖ కేంద్రాల్లో ఒకటని భట్టి పేర్కొన్నారు. భవిష్యత్ జీఎస్టీ పరిపాలనకు అవసరమైన సాంకేతిక సామర్థ్యాలు హైదరాబాద్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ సెక్రటేరియట్‌కు హైదరాబాద్‌లో ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల జీఎస్టీ పరిపాలన రాష్ట్రాలకు మరింత చేరువ కావడంతో పాటు, సాంకేతికత ఆధారిత పన్ను మోసాల గుర్తింపు వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని అన్నారు. సరుకుల వాహనాల తనిఖీల విషయంలో ప్రస్తుతం ఉన్న అధికారాలను మూల రాష్ట్రం, గమ్య రాష్ట్రం రెండింటికీ కొనసాగించాలని తెలంగాణ సూచించింది. పన్ను ఎగవేతను అరికట్టడంతో పాటు, వ్యాపార కార్యకలాపాలకు అనవసరమైన ఇబ్బందులు కలగకుండా సమతుల్య విధానం అవసరమని భట్టి పేర్కొన్నారు.

తెలంగాణ వంటి ఎగుమతి రాష్ట్రాల సహకారాన్ని గుర్తించాలని భట్టి కోరారు. పోటీతో కూడిన ఎగుమతి వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు మౌలిక సదుపాయాలు, ప్రజా ప్రయోజనాల కోసం పెట్టుబడులు పెట్టే రాష్ట్రాలకు తగిన మద్దతు, ప్రోత్సాహకాలు అందించాలని సూచించారు. ప్రజారోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు హెల్త్ సెక్యూరిటీ, నేషనల్ సెక్యూరిటీ సెస్సులలో రాష్ట్రాలకు నిర్దిష్టమైన, పారదర్శక వాటా కల్పించాలని కోరారు. జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం అంతిమంగా కేంద్రానిదీ, రాష్ట్రాలదీ కాదని.. అది భారత ప్రజలకు చెందినదని భట్టి పేర్కొన్నారు. ప్రజలపై ఉన్న బాధ్యతను గుర్తుంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. "నిజాయితీగల పన్నుదారులకు అనుసరణ ప్రక్రియను సులభతరం చేయడం.. ఉద్దేశపూర్వక పన్ను మోసాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగించడం.. ఈ రెండూ సమాంతరంగా సాగాలి" అని భట్టి స్పష్టం చేశారు. ప్రజలు కేంద్రం, రాష్ట్రాలపై ఉంచిన విశ్వాసానికి తగిన విధంగా జీఎస్టీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు.

# వ్యవసాయ యాంత్రీకరణ పథకం ప్రారంభానికి రాష్ట్రం సిద్ధం

మొదటి పేజీ తరువాయి...

రైతులకు మరింత విస్తృతంగా యాంత్రీకరణ ప్రయోజనాలు అందించేందుకు 2026-27 సంవత్సరానికి రూ.147.99 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్ర, కేంద్ర వాటాలతో పథకం అమలుకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే చేపట్టామని, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేయాల్సిన మార్గదర్శకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎదురుచూస్తోందని చెప్పారు. కేంద్ర మార్గదర్శకాలు అందిన వెంటనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టి, రైతులకు పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**రైతుకు నచ్చిన కంపెనీ నుంచి పరికరం కొనుగోలు చేసే అవకాశం...**

రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాన్ని తమకు నచ్చిన ఎంప్యానెల్ చేసిన కంపెనీ వద్ద కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం పథకం ద్వారా లబ్ధి పొందే రైతు ఒక నిర్దిష్ట సంస్థ లేదా ఎంపిక చేసిన సరఫరాదారుడి వద్ద నుంచే పరికరం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి లేకుండా, రైతుకు మరింత స్వేచ్ఛ ఉండే విధంగా విధానాన్ని రూపొందించాలని తెలిపారు. సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేయనుండటం వల్ల రైతులు కూడా వ్యవసాయ పరికరం కొనుగోలు చేసే ముందు వివిధ కంపెనీల ధరలను, నాణ్యతను పరిశీలించి, తక్కువ ధరకు మంచి నాణ్యత కలిగిన పరికరం ఎక్కడ లభిస్తే అక్కడే కొనుగోలు చేసుకోవాలని మంత్రి సూచించారు. దీనివల్ల ప్రభుత్వ సబ్సిడీ సద్వినియోగం కావడంతో పాటు, ఎక్కువ మంది రైతులకు యాంత్రీకరణ పరికరాలు అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ రైతులకు 60 శాతం, బీసీ మరియు ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ అందుతుందని మంత్రి తెలిపారు. సబ్సిడీ నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే విధానం వల్ల మధ్యవర్తుల ప్రమేయం తగ్గడంతో పాటు, పథకంలో పారదర్శకత పెరుగుతుందని మంత్రి అన్నారు.

**37 రకాల వ్యవసాయ పరికరాలు...**

వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించేందుకు ప్రస్తుతం 37 రకాల వ్యవసాయ పరికరాలను ఖరారు చేసినట్లు మంత్రి తెలిపారు. గతంలో పథకం పరిధిలో 19 రకాల పరికరాలు మాత్రమే ఉండేవని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం పరికరాల సంఖ్యను 37 రకాలకు పెంచినట్లు చెప్పారు. ఇందులో పవర్ టిల్లర్, బ్యాటరీ ఆపరేటెడ్ ఎలక్ట్రిక్ టిల్లర్/వీడర్, డిస్క్ ప్లౌ, కల్టివేటర్, లెవలింగ్ బ్లేడ్, రోటావేటర్, రోటో-పుడ్లర్, రివర్సిబుల్ ఎంబీ ప్లౌ, సబ్ సాయిలర్, బండ్ ఫార్మర్, సీడ్-కం-ఫెర్టిలైజర్ డ్రిల్, మల్టీ క్రాప్ ప్లాంటర్, రైజ్డ్ బెడ్ ప్లాంటర్, పోస్ట్ హోల్ డిగ్గర్, ప్లాస్టిక్ మల్చ్ లేయింగ్ మెషిన్, ఫెర్టిలైజర్ బ్రాడ్‌కాస్టర్, రిడ్జ్ ఫరో ప్లాంటర్, ట్రాక్టర్ ఆపరేటెడ్ స్లాషర్, పవర్ వీడర్, మాన్యువల్ నాప్‌సాక్ స్ప్రేయర్, పవర్ నాప్‌సాక్ స్ప్రేయర్, ట్రాక్టర్ ఆపరేటెడ్ స్ప్రేయర్, కిసాన్ డ్రోన్, కంబైన్ హార్వెస్టర్, మైజ్ కంబైన్ హార్వెస్టర్, మల్టీ క్రాప్ థ్రెషర్, విన్నోయింగ్ ఫ్యాన్, మైజ్ షెల్లర్, టెలిస్కోపిక్ హార్వెస్టింగ్ పోల్స్, పసుపు బాయిలర్, పసుపు పాలిషర్, ప్యాడీ మొబైల్ డ్రైయర్, స్ట్రా బేలర్, రోటరీ ష్రెడర్, మల్చర్, రోటరీ స్ట్రా స్లాషర్, బ్రష్ కట్టర్ ఉన్నాయి. రైతుల అవసరాలు, సాగు విధానాల్లో వస్తున్న మార్పులు, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని పథకం అమలు మధ్యలో కూడా రైతులకు ఉపయోగపడే కొత్త వ్యవసాయ పరికరాలను చేర్చుకునేలా విధానాలను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

**యాంత్రీకరణలో ఎఫ్‌పీఓలకు కీలక పాత్ర...**

వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలులో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లను (ఎఫ్‌పీఓలను) భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని ఎఫ్‌పీఓల నుంచి సలహాలు, సూచనలు తీసుకుని, వాటిని పథకం అమలులో ఎలా ఉపయోగించుకోవచ్చో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చిన్న, సన్నకారు రైతులు ప్రతి వ్యవసాయ పరికరాన్ని సొంతంగా కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా, ఎఫ్‌పీఓల ఆధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి వ్యవసాయ పరికరాలను రైతులకు అద్దెకు అందించే అవకాశాన్ని పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. ఒక్క రైతు ఖరీదైన యంత్రాన్ని కొనుగోలు చేయడం కంటే, ఒక ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో పరికరాలను అందుబాటులో ఉంచి అవసరమైన సమయంలో రైతులకు అద్దెకు అందిస్తే, తక్కువ ఖర్చుతో ఎక్కువ మంది రైతులు యాంత్రీకరణ ప్రయోజనాలను పొందే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు.

**రైతుల అభిప్రాయాలనూ సేకరించాలి..**

వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతులకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు రైతుల అభిప్రాయాలను కూడా తీసుకోవాలని మంత్రి తుమ్మల తెలిపారు. వచ్చే మంగళవారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంపై రాష్ట్రవ్యాప్తంగా రైతులు, ఎఫ్‌పీఓల ప్రతినిధులతో మాట్లాడి అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. రైతుల నుంచి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకుని, సాధ్యాసాధ్యాలను పరిశీలించి, రైతులకు గరిష్ఠ ప్రయోజనం కలిగేలా వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి తుది రూపం ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# విదేశాల్లోనూ వెలుగుతున్న తెలంగాణ సంస్కృతి

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ అధికారిక వెబ్ సైట్ ను స్పీకర్ ప్రసాద్ గారు ఆవిష్కరించారు. ఈ ఏడాది బతుకమ్మ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను కూడా ఆవిష్కరించారు. ఆ తర్వాత ప్రవాస తెలుగు సంఘం ప్రతినిధులతోనూ మాట్లాడారు. స్విట్జర్లాండ్ లో నిర్మించబోయే శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ గురించి స్పీకర్ బృందానికి స్విట్జర్లాండ్ తెలుగు సంఘం ప్రతినిధులు తెలియజేశారు. టెంపుల్ నిర్మాణానికి అవసరమయ్యే నిధులు, సహాయ సహకారాల గురించి తప్పకుండా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రతినిధులతో మాట్లాడి.. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు హామీ ఇచ్చారు. బతుకమ్మ ఉత్సవం అనేది కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళా శక్తికి, ప్రకృతితో మమేకమైన జీవనానికి ప్రతీక అని స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు పేర్కొన్నారు. ఇలా ప్రతి ఏటా స్విట్జర్లాండ్ లో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నందుకు సంఘం ప్రతినిధులను స్పీకర్ గారి బృందం అభినందించింది. ఈ నెల 24వ తేదీన స్విట్జర్లాండ్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాలను విజయవంతం చేయాలని స్పీకర్ పిలుపునిచ్చారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు గారు కూడా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ శ్రీ బండ ప్రకాశ్ గారు, శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి గారు, శాసనమండలి కార్యదర్శి నరసింహాచార్యులు గారు, స్పీకర్ ఓఎస్డీ వెంకటేశం గారు, స్విట్జర్లాండ్ తెలుగు సంఘం అధ్యక్షులు కిరణ్ వేదాంతం గారు, కార్యదర్శి హరి ప్రసాద్ గారు, ఈసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాస్వామ్య వ్యవస్థల అధ్యయనం ద్వారా పార్లమెంటరీ విధానాలపై మరింత అవగాహన**

స్విట్జర్లాండ్ దేశంలోని బెర్న్ సిటీలో ఉన్న చారిత్రాత్మక పార్లమెంట్ భవనాన్ని తెలంగాణ శాసనసభ సభాపతి (స్పీకర్) శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ శ్రీ బండ ప్రకాష్ గారు గురువారం సందర్శించారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన విదేశీ అధ్యయన పర్యటనలో భాగంగా తెలంగాణ శాసన వ్యవస్థ ప్రతినిధుల బృందం స్విట్జర్లాండ్ పార్లమెంట్ భవనాన్ని సందర్శించింది. స్విట్జర్లాండ్ పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్య సంప్రదాయాలు, శాసనసభల పనితీరు, చట్టాల రూపకల్పన విధానాలు, ప్రజాప్రతినిధుల బాధ్యతలు వంటి అంశాలపై అధ్యయనం చేయడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాలను రూపొందించడం, ప్రభుత్వ విధానాలపై చర్చించడం, ప్రజా సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని చెప్పారు. ప్రపంచంలోని వివిధ దేశాల పార్లమెంటరీ వ్యవస్థలను అధ్యయనం చేయడం ద్వారా ప్రజాస్వామ్య విలువలు, శాసనసభల నిర్వహణ, పారదర్శకత, జవాబుదారీతనం వంటి అంశాలపై మరింత అవగాహన పెంపొందించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ పర్యటనలో తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ శ్రీ బండ ప్రకాష్ గారు, శాసనసభ సెక్రెటరీ రెండ్ల తిరుపతి గారు, శాసన మండలి సెక్రెటరీ డా నరసింహాచార్యులు గారు, శాసన సభ స్పీకర్ ఓఎస్డీ వెంకటేష్ గారు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారులకు భారీ ఊరట

## జీఎస్టీ అధికారుల అరెస్ట్ అధికారం రద్దు..




న్యూఢిల్లీ : దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసే దిశగా జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో.. పన్ను చెల్లింపుదారులకు పెద్దపీట వేస్తూ పలు సంస్కరణలకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా వ్యాపార వర్గాల నుంచి ఎప్పట్నుంచో డిమాండ్ ఉన్న జీఎస్టీ అధికారుల అరెస్ట్ అధికారాలను కౌన్సిల్ రద్దు చేసింది. ఈ విధానం ప్రకారం.. నిర్దిష్ట సమాచార ఆధారంగా మాత్రమే సరకులను అడ్డుకుని తనిఖీ చేయాల్సి ఉంటుంది. దీంతో జీఎస్టీ అధికారులు యథేచ్ఛగా వాహనాలను ఆపి చెక్ చేసే అవకాశం ఉండదు. సరకుల స్వాధీనం కూడా సరఫరా జరిగే రాష్ట్రం లేదా సరకు చేరే రాష్ట్రానికి చెందిన అధికారులు మాత్రమే చేపట్టేలా నిబంధనలను మార్చాలని మండలి సిఫార్సు చేసింది. దీంతోపాటు నేర విచారణకు సంబంధించిన కనీస పరిమితిని కూడా రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచుతున్నట్టు కౌన్సిల్ నిర్ణయించింది. ఇకపై జరిమానా, జైలు శిక్ష లేదా రెండింట్లో ఏది విధించాలన్నది కేసును బట్టి న్యాయస్థానాలే నిర్ణయిస్తాయని స్పష్టం చేసింది. నిర్దిష్ట జరిమానా లేని ఉల్లంఘనలకు విధించే సాధారణ జరిమానానూ రూ.25 వేల నుంచి రూ.10 వేలకు తగ్గించింది. పన్ను చెల్లింపుల్లో ఆలస్యం చేయడం, చిన్న చిన్న పొరపాట్లు చేయడం, రిటర్నులు ఆలస్యంగా దాఖలు చేయడం వంటి సందర్భాల్లో.. పన్ను వసూలు, వడ్డీ, నిబంధనల కు అనుగుణంగా జరిమానా మాత్రమే ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. అంతకుమించి చర్యలు తీసుకోకూడదని స్పష్టం చేసింది. కొంతకాలంగా కఠినమైన పన్ను విధానాలతో వ్యాపార రంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో.. జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న ఈ నిర్ణయాలు భారీ ఊరటను కలిగించనున్నాయి. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ (సులభతర వాణిజ్యం)'ను ప్రోత్సహించడం సహా పన్ను నిబంధనల అమలులో భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ సంస్కరణలు తీసుకొచ్చినట్లు నిర్మలా సీతారా మన్ తెలిపారు. జీఎస్టీ రేట్లలో మార్పులు తీసు కురావడం కంటే దానిని సరళీకరించడంపైనే ఈ భేటీలో ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్టు పేర్కొన్నారామె.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొమిరెడ్డి లింగారెడ్డి

జగిత్యాల్ ప్రతినిధి అక్టోబర్ 8 (ప్రజాకలం)

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా కొమిరెడ్డి లింగారెడ్డిని నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజంగి నందయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గజంగి నందయ్య మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచనల మేరకు కొమిరెడ్డి లింగారెడ్డి పార్టీ విధి విధానాలను పాటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.



## తపోవన్ లో ముందస్తు బతుకమ్మ వేడుకలు



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 8 (ప్రజాకలం)

జగిత్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల తపోవన్ హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. అనంతరం బతుకమ్మను దారి పొడవునా ఊరేగించారు. 25వ వార్డు కౌన్సిలర్ సామల్ల జమున రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను తిలకించి విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అనుమల్ల శ్యామ్ కౌన్సిలర్‌ను శాలువాతో సత్కరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ బతుకమ్మకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనుమల్ల శ్వేత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యా వాలంటీర్లకు రూ.50 వేల జీతభత్యాలు..



మల్లాపూర్ అక్టోబర్ 08 ( ప్రజా కలం ప్రతినిధి )మండలంలోని కొత్త ధామరాజ్‌పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్న విద్యా వాలంటీర్లకు జీతభత్యాల కింద గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు రూ.50 వేల నగదును అందజేశారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు వాలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించి జీతభత్యాల కోసం ఈ మొత్తాన్ని అందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధిలో విద్యా వాలంటీర్ల పాత్ర కీలకమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు గ్రామస్థులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తమవంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా పాఠశాల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎగ్గరపు లింబద్రి, ఉప సర్పంచ్ బద్దం హారిష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వంశీధర్ రెడ్డి ,ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుధాకర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు బద్దం కృష్ణ, జవిడి భూమేష్, కచర్ల రాజేందర్, నిగ రవి, ఎర్ర తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ వాణిజ్య సెల్ కన్వీనర్ గా సిరిపురం శ్రీనివాస్

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 8 (ప్రజాకలం) జగిత్యాల పట్టణానికి చెందిన సిరిపురం శ్రీనివాస్ ను జగిత్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ వాణిజ్య సెల్ కన్వీనర్ గా నియమిస్తూ గురువారం నాడు బిజెపి జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే కాకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు శ్రీనివాస్ కు సూచించారు. కాగా బిజెపి జిల్లా వాణిజ్యసలు కన్వీనర్ గా సిరిపురం శ్రీనివాస్ ను నియమించడం పట్ల పట్టణానికి చెందిన పలువురు వ్యాపార, వాణిజ్య వేత్తలు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.



## కోడి పందాల స్థావరం పై పోలీసుల దాడి

గొల్లపల్లి అక్టోబర్ 08 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో కోడి పందాలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు, గొల్లపల్లి ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి లక్ష్మీపూర్ గ్రామంలో కోడి పందాలు నిర్వహిస్తున్న 8 మంది జూదరులతో పాటు మరికొంతమందినీ పట్టుకోగా పోలీసులను గమనించిన కొందరు జూదరులు అక్కడి నుండి పారిపోయారు. సంఘటన స్థలంలో 1 కోడి పుంజు , 4 ద్విచక్ర వాహనాలు, 5 సెల్‌ఫోన్లు,రూ.2,000 నగదును స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, జూదరులు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

ఈ సందర్భంగా ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి మాట్లాడుతూ గొల్లపల్లి మండల పరిధిలోని గ్రామాలలో ఎవరైనా కోడి పందాలు, పేకాట ,ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే వెంటనే గొల్లపల్లి పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు .సమాచారాన్ని అందించే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అసాంఘిక కార్యకలపాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

## భక్తుల భద్రత, మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యం

### ఆలయ పునర్నిర్మాణం, పుష్కర ఘాట్ల పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్





జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 08 (ప్రజాకలం):

ధర్మపురి పట్టణంలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు, రానున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నిర్మిస్తున్న పుష్కర ఘాట్ల పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని కొనసాగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ, నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గోదావరి నది పరివాహక ప్రాంతంలో నిర్మిస్తున్న పుష్కర ఘాట్ల పనులను పరిశీలించారు. 2027 గోదావరి పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు.పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు, రాకపోకలు, ఇతర మౌలిక వసతులను సమగ్రంగా ఏర్పాటు చేయాలని సూచించారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఘాట్ల వద్ద అవసరమైన సౌకర్యాలు, భద్రతా చర్యలను ముందుగానే ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, నిర్దేశించిన గడువులోగా పుష్కరాల ఏర్పాట్లన్నింటినీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ పి. మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీవో, తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

### యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్





జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 08 (ప్రజాకలం):

ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, పనుల్లో వేగంతో పాటు నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పాఠశాల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి ఇప్పటివరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, చేపట్టాల్సిన తదుపరి పనులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా కార్యాచరణ రూపొందించుకుని పనులను వేగవంతం చేయాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. పాఠశాల భవన నిర్మాణంతో పాటు తరగతి గదులు, విద్యార్థులకు అవసరమైన ఇతర సౌకర్యాలను ప్రణాళికాబద్ధంగా, అన్ని ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల నిర్మాణానికి సంబంధించిన స్థల పరిస్థితులు, నిర్మాణ పనుల పురోగతి, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, ఎంపీడీఓ, మండల తహసీల్దార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభతరం

### వాట్సాప్ ద్వారా నేరుగా ఫిర్యాదులు చేసుకునే అవకాశం - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 8

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో ప్రత్యేక వాట్సాప్ నంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులు, వినతులను నేరుగా వాట్సాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుక వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఇకపై ప్రభుత్వ సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగవలసిన అవసరం లేకుండా, ఇంటి నుంచే వాట్సాప్ ద్వారా తమ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేయవచ్చని తెలిపారు. హైదరాబాద్‌లోని జిల్లా ఇన్చార్జి మంత్రి పేషీలోనూ ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించడంతో పాటు, వాటి పరిష్కారంలో జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

**ఇంచార్జ్ జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు**
**పేషీ నం.8500689596**
**మంచిర్యాల కలెక్టరేట్ నం.9492123642**

ప్రజలు పైన పేర్కొన్న నంబర్ కు కాల్ చేయవద్దని, కేవలం వాట్సాప్ నంబర్ కు తమ ఫిర్యాదులను మెసేజ్ రూపంలో పంపవచ్చని, ఫిర్యాదులో సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలు, సమస్య ఉన్న ప్రదేశం, చిరునామా, అవసరమైన ఆధారాలు, సంబంధిత ఫొటోలను జత చేయాలని, తద్వారా సమస్యను గుర్తించి, సంబంధిత శాఖకు ఫిర్యాదును పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సులభంగా అందించడంతో పాటు, వారి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపడమే ఈ ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌ల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఫార్మా ఉద్యోగాలు

### - విద్యార్థులకు కలెక్టర్ శ్రీహర్ష శుభాకాంక్షలు



పెద్దపల్లి,అక్టోబర్ 08:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పూర్తి చేసి,ప్రముఖ 'గ్రాన్యూల్స్ ఫార్మా ఇండియా లిమిటెడ్'లో 75 రోజుల శిక్షణ ముగించుకుని ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు.గురువారం విద్యార్థులు డీఐఈఓ కల్పనతో కలిసి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగాలు సాధించడం గర్వకారణమన్నారు. క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తూ నైపుణ్యాలను నిరంతరం పెంచుకోవాలని, సంస్థకు మంచి పేరు తేవాలని సూచించారు.విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న అధికారులను ఆయన ప్రశంసించారు.డీఐఈఓ కల్పన మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 08 (ప్రజాకలం): మెట్‌పల్లి పట్టణంలోని వెంకట్‌రెడ్డి గార్డెన్స్‌లో గురువారం కోరుట్ల నియోజకవర్గానికి చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు ముఖ్య అతిథిగా పాల్గొని 165 మంది లబ్ధిదారులకు రూ. 59.87 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వివిధ మండలాలు, పట్టణాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ప్రవీణ్ కుమార్

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 8(ప్రజాకలం)

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా వేంపేట్ గ్రామ సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, పీసీసీ నాయకులు జువ్వాడి కృష్ణారావుల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రవీణ్ కుమార్‌కు జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ ఉద్యమంలో ప్రవీణ్ కుమార్ చురుకుగా పాల్గొని, పలుమార్లు అరెస్టై జైలు జీవితం గడిపినట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు.దీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్‌కు జిల్లా అధికార ప్రతినిధి పదవి దక్కడం కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని వారు అన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్‌కు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయిలో పార్టీ వాణిని బలంగా వినిపిస్తూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ప్రవీణ్ కుమార్ తెలిపారు.



## మురిసిన పూదోట.. పరవశించిన చిన్నారుల ఆట

### గాయత్రి విద్యానికేతన్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు



పెద్దపల్లి,అక్టోబర్ 08:(ప్రజాకాలం జిల్లాప్రతినిధి) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగ విశిష్టతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని,ప్రకృతిని పూజించే గొప్ప పండుగ ఇదని గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ పేర్కొన్నారు.స్థానిక గాయత్రి విద్యానికేతన్‌లో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గురువారం ప్రి ప్రైమరీ విద్యార్థులకు ముందస్తు బతుకమ్మ సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి,రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను పాఠశాలకు తీసుకొచ్చి ఉత్సాహంగా ఆడపాడటంతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభతో కళకళలాడింది. ఈ సందర్భంగా చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలు,ప్రకృతి పట్ల ప్రేమ మరియు అవగాహన పెంపొందించేందుకే పాఠశాలలో ఈ వేడుకలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గౌరీదేవి కరుణాకటాక్షాలతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రజని,ఉపాధ్యాయ బృందం,విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఈనెల 14న బీఆర్ఎస్ సింగరేణి కార్మిక గర్జన

### -ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పెద్దపల్లి,అక్టోబర్ 08:(ప్రజాకాలం జిల్లాప్రతినిధి):

సింగరేణి కార్మికుల సమస్యలపై గళమెత్తేందుకు భారత రాష్ట్ర సమితి సమరశంఖం పూరించింది.కార్మికుల హక్కుల సాధన, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 14న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో సింగరేణి కార్మిక గర్జన పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పార్టీ ప్రకటించింది.ఈ మహాసభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. బహిరంగ సభ నిర్వహణ,ఏర్పాట్లపై హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం కీలక సన్నాహక సమావేశం జరిగింది.మాజీ మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సింగరేణి పరివాహక ప్రాంతాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,ముఖ్య నేతలు,టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ అక్టోబర్ 14న సాయంత్రం 5 గంటలకు గోదావరిఖని జీఎం కార్యాలయ మైదానంలో జరగనున్న సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.సభ ఏర్పాట్లకు సంబంధించి కీలక బాధ్యతలను స్థానిక ముఖ్య నేతలకు అప్పగించారు. కార్మికులు పెద్ద ఎత్తున కదిలివచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.ఈ సన్నాహక భేటీలో సింగరేణి ప్రాంత ప్రముఖ నేతలు బాల్క సుమన్,కొప్పుల ఈశ్వర్,కోవా లక్ష్మి, చిన్నయ్య,వద్దిరాజు రవిచంద్ర,విజిత్‌రావు,కోరుకంటి చందర్,పుట్ట మధు,పాడి కౌశిక్‌రెడ్డి,హరీశ్‌రెడ్డి,రేగా కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా కలం
శుక్రవారం, అక్టోబర్ 9, 2026

## అమెరికా నిజంగానే
# దివాళా తీస్తుందా?

మొదటి నుంచీ ఎలాన్ మస్క్‌కి ఒక ప్రత్యేకత ఉంది. ఇతరులు భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నప్పుడు.. తాను ఆ భవిష్యత్తును తయారు చేయాలని ప్రయత్నిస్తుంటారు. ఎలక్ట్రిక్ కార్ల నుంచి అంతరిక్ష ప్రయాణం వరకు ఆయన చేసిన ప్రయోగాలు అందుకు ఉదాహరణ. అందుకే అమెరికా ఆర్థిక భవిష్యత్తుపై ఆయన చేసిన హెచ్చరికను కూడా మార్కెట్లు, టెక్ ప్రపంచం, పెట్టుబడిదారులు ఆసక్తిగా గమనిస్తున్నాయి. " అమెరికా దివాళా తీసే అవకాసం ఉంది" అని చెప్పినప్పుడు అది సాధారణ కామెంట్‌గా మిగలలేదు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వర్గాల్లో చర్చ మొదలైంది.మస్క్ చెప్పింది నిజంగా అమెరికా రేపే దివాళా తీస్తుందన్న హెచ్చరికేనా? లేక భారీగా పెరుగుతున్న అప్పులు, వడ్డీ భారం, బడ్జెట్ లోటు గురించి ఆయన చెబుతున్న అసలు సమస్యను మనం మరో కోణంలో చూడాలనా? అమెరికా జాతీయ రుణం గురించి మాట్లాడినప్పుడు మస్క్ ఈ తీవ్రమైన హెచ్చరిక చేశారు. ఏఐ రోబోటిక్స్ సాంకేతికతలు గనుక లేకపోతే అమెరికా ఆర్థికంగా తీవ్ర చిక్కుల్లో పడుతుందని, అప్పుల ఊబి నుంచి గట్టెక్కడానికి ఇవి తప్ప మరో మార్గం లేదని ఆయన స్పష్టం చేశారు.అయితే మస్క్ మాటల అంతరార్థం "అమెరికా దగ్గర రూపాయి (డాలర్) కూడా లేకుండా పోయింది" అని కాదు; పెరుగుతున్న అప్పుల వేగాన్ని దేశ ఆర్థిక వృద్ధి దాటలేకపోతే అసలు సమస్య మొదలవుతుందనేదే ఆయన ఆందోళన. అమెరికా ఇప్పటికే అప్పులపై చెల్లిస్తున్న వడ్డీ ఖర్చు రికార్డు స్థాయికి చేరడమే ఈ భయానికి ప్రధాన కారణం.అమెరికా జాతీయ రుణం ఇప్పటికే 40 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న ఆర్థిక విధానాలు దీర్ఘకాలంలో స్థిరంగా కొనసాగలేవని, రుణం-జీడీపీ నిష్పత్తి భవిష్యత్తులో మరింత ప్రమాదకరంగా మారుతుందని అమెరికా ట్రెజరీ స్వయంగా అంగీకరించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందిఇక్కడ అసలు సమస్య అప్పు చేయడం మాత్రమే కాదు, దానిపై చెల్లిస్తున్న వడ్డీ భారం ఏటికేటా కొండలా పెరిగిపోవడం. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం కేవలం అప్పులపై వడ్డీ చెల్లించడానికే ఏడాదికి సుమారు 1 ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. అంటే ప్రభుత్వం సేకరించే ప్రతి ఐదు డాలర్ల ఆదాయంలో దాదాపు ఒక డాలర్ కేవలం వడ్డీలకే సరిపోతోంది. "అప్పు చేసి పప్పు కూడు తిన్నంత కాలం బాగానే ఉన్నా, అసలు కంటే వడ్డీయే ఎక్కువైనప్పుడు" అసలు కథ మొదలవుతుంది. అమెరికా విషయంలో సరిగ్గా ఇదే జరుగుతుండటంతో ఆర్థిక నిపుణులు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆమోదయోగ్యమైన 'రిజర్వ్ కరెన్సీ' అయిన డాలర్‌ను ముద్రించే అధికారం అమెరికాకు ఉంది. కాబట్టి దేశం పూర్తిగా దివాళా తీసి, మూతపడిపోతుందనే కోణంలో మస్క్ వ్యాఖ్యలను చూడలేం. కానీ, పెరుగుతున్న అప్పుల వల్ల వడ్డీ భారం పెరిగి, దానికోసం మరింత అప్పు చేయాల్సి రావడం, దానివల్ల మార్కెట్‌లో వడ్డీ రేట్లు మరింత పెరిగిపోవడం లాంటి 'డెట్ స్పైరల్' ఏర్పడే ప్రమాదం ఖచ్చితంగా ఉంది. దిగ్గజ ఆర్థికవేత్త రే డాలియో, జేపీ మోర్గాన్ సీఈఓ జేమీ డైమన్ వంటి వారు కూడా ఇదే రుణ విషవలయం గురించి అమెరికాను హెచ్చరించడం గమనార్హం.అప్పుల సుడిగుండం నుంచి బయటపడటానికి ఏ దేశానికైనా రెండే మార్గాలుంటాయి: ఒకటి ఖర్చులు తగ్గించుకోవడం, రెండు ఆర్థిక వ్యవస్థను వేగంగా పెంచడం. మస్క్ రెండవ మార్గాన్ని ఎంచుకున్నారు. రోబోటిక్స్ రంగాల వల్ల మానవ ఉత్పాదకత పదింతలు పెరిగితే, వస్తువులు, సేవల ఉత్పత్తి విపరీతంగా పెరుగుతుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థ పరిమాణం పెరిగి, ప్రభుత్వానికి పన్నుల రూపంలో భారీ ఆదాయం వస్తుంది.ఫలితంగా అప్పు-జీడీపీ నిష్పత్తి తగ్గుతుందని మస్క్ భావిస్తున్నారు. ఆయన ఆలోచనలో రోబోట్ అనేది కేవలం ఒక యంత్రం కాదు, దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు తీగెత్తించే గ్రోత్ ఇంజిన్. అయితే, అంత త్వరగా అంతటి ఉత్పాదకతను సాధించగలదా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి.అమెరికాలో పెద్ద ఆర్థిక సంక్షోభం తలెత్తితే అది వారి సొంత సమస్య మాత్రమే కాదని, గ్లోబల్ ఎకానమీలో భాగంగా భారత్‌పై కూడా దాని ప్రభావం ఖచ్చితంగా ఉంటుందని మనం గ్రహించాలి. అమెరికా బాండ్ యీల్డ్స్ పెరిగితే విదేశీ పెట్టుబడిదారులు భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి తమ డబ్బును ఉపసంహరించుకుని అమెరికా ఆస్తుల్లో పెట్టుబడి పెడతారు. దీనివల్ల భారత స్టాక్ మార్కెట్లలో హెచ్చుతగ్గులు రావడమే కాకుండా రూపాయి విలువ పడిపోయే అవకాశం ఉంది.డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడితే మన దిగుమతుల ఖర్చు భారీగా పెరుగుతుంది. ముఖ్యంగా భారత్ అత్యధికంగా దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగి, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు రవాణా ఖర్చులు ప్రియమవుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరిగి హైదరాబాద్‌లో ఉండే ఒక సామాన్య కుటుంబం నెలవారీ బడ్జెట్‌పై నేరుగా ప్రభావం పడుతుంది. భారతీయ ఐటీ రంగానికి ఇది రెండు రకాల పరిణామాలను తెచ్చిపెట్టవచ్చు. ఒకవైపు అమెరికా కంపెనీలు ఖర్చులు తగ్గించుకోవడానికి ప్రాజెక్టులను కుదిస్తే ఐటీ అవుట్‌సోర్సింగ్‌పై ఒత్తిడి పెరుగుతుంది. మరోవైపు, తమ ఖర్చులను వేగంగా తగ్గించుకోవడానికి వారు ఆశ్రయిస్తే, మన ఐటీ కంపెనీలకు సరికొత్త అవకాశాలు తలుపు తడతాయిమొత్తానికి, మస్క్ చెప్పినట్లుగా అమెరికా వెంటనే దివాళా తీయకపోవచ్చు కానీ, పెరుగుతున్న అప్పులు మరియు వడ్డీ భారం నిజంగానే ఆ దేశానికి పెద్ద తలనొప్పిగా మారాయి. మస్క్ హెచ్చరికలో కొంత అతిశయోక్తి ఉన్నప్పటికీ, అమెరికా అప్పుల సమస్యను ప్రపంచం ఇక ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయలేదనేది పచ్చి నిజం.అందుకే ఇప్పుడు ఆలోచించాల్సింది "అమెరికా దివాళా తీస్తుందా,లేదా?" అని కానే కాదు, పెరుగుతున్న అప్పుల భారం కంటే వేగంగా, అమెరికా తన ఆర్థిక వ్యవస్థను పరుగులు తీగెత్తించగలదా లేదా అనేదే! దీనికి కాలమే సమాధానం చెప్పాలి.

## చామనపల్లి గ్రామ పునరావాసానికి
# భూసేకరణ ప్రక్రియ చేపడతాం

**భారీ వర్షాలు, వరదల సమయంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు**

**ప్రజల అభిప్రాయాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



ధర్మారం, అక్టోబర్ 08 : ( ప్రజా కలం ప్రతినిధి ) మండలంలోని చామనపల్లి గ్రామ పునరావాసానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియను చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ధర్మారం మండలం చామనపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం రోజున భూసేకరణ, పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు, శ్రీనివాస రావు గుప్త, చీఫ్ ఇంజనీర్ (ఇరిగేషన్ ) రామగుండంలతో కలిసి జిల్లా కలెక్టర్ గ్రామస్థుల తో సమావేశం నిర్వహించి, గ్రామ పునరావాసం, భూసే కరణకు సంబంధించి వారి అభిప్రాయాలను తెలుసు కున్నారు. అనంతరం గ్రామం లో విస్తృతంగా కాలినడకన పర్యటించి పలు ఇళ్లను పరిశీ లించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల సమయంలో గ్రామం ముంపునకు గురై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అనేక మంది గ్రామస్థులు తమకు వినతులు సమర్పించారని తెలిపారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉ ంచుకుని చామనపల్లి గ్రామం లో భూసేకరణ చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. మేడారం రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్‌కు సంబంధించి 100 మీటర్ల పరిధి వరకు అవసరమైన తరలింపు ప్రక్రియను తక్షణమే చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. అయితే మొత్తం గ్రామాన్ని పునరావాసం చేయాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభు త్వానికి పంపిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థుల అభిప్రాయాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రజల నమన్యలు అవసరాలు, అభిప్రాయాల ను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపడు తామని ఆయన పేర్కొన్నారు. భూసేకరణ, పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ద్వారా అందిన ప్రజల వినతుల మేరకు చామనపల్లి గ్రామంలో భూసేకరణ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిస్థితుల ను పరిశీలించి, గ్రామస్థుల నుంచి అభి ప్రాయాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు ప్రభుత్వం తనను పంపి నట్లు చెప్పారు. గ్రామం లో సుమారు 140 ఇళ్లు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉందని కమిషనర్ తెలిపారు. గ్రామం లోని పాఠశాల, మహిళా సమాఖ్య భవనం వంటి నిర్మాణాలను ఇప్పటికే ఎత్తైన ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం అవి ముంపునకు గురికావడం లేదని పేర్కొన్నారు. పునరావాస కాలనీని అభివృద్ధి చేసి అర్హులైన వారికి ఇంటి స్థలాలు కల్పించేలా చర్యలు తీసు కుంటామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి వ్యక్తికి నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు చేపడతామని చెప్పారు. ముంపు కారణంగా జీవ నోపాధిని కోల్పోయే వారికి కూడా నిబంధనల మేరకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థుల అభిప్రాయాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమావేశం లో పెద్దపల్లి ఆర్డీఓ గంగయ్య, ఇరిగేషన్ అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హామీలను తక్షణమే నెరవేర్చాలి

**హెల్త్ కార్డుల పునరుద్ధరణ,ఇళ్ల స్థలాల కేటాయింపు చేపట్టాలి**

**మీడియా అకాడమీ మాజీ చైర్మన్,టీయూడబ్ల్యూజే హెచ్-143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ**

పెద్దపల్లి,అక్టోబర్ 08(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే నెరవేర్చాలని తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్,టీయూడబ్ల్యూజే హెచ్-143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ డిమాండ్ చేశారు.గురువారం తన స్వగ్రామం మంథని మండలం గాజులపల్లె పర్యటన ముగించుకుని హైదరాబాద్ వెళ్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు.రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు,నిలిచిపోయిన హెల్త్ కార్డులను వెంటనే పునరుద్ధరించాలని,అర్హులకు ఇళ్ల స్థలాలను అందించాలని కోరారు.ఇచ్చిన మాట ప్రకారం జర్నలిస్టుల సంక్షేమ నిధిని రూ.200 కోట్లకు పెంచాలని స్పష్టం చేసిన ఆయన,గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన రూ.42 కోట్లకు అదనంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని విమర్శించారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు గతంలో ఇచ్చిన రూ.1లక్ష ఆర్థిక సాయాన్ని రూ.2 లక్షలకు పెంచుతామన్న హామీని వెంటనే అమలు చేయాలని,గతంలో హౌసింగ్ సొసైటీల ద్వారా 60 శాతం మందికి ఇళ్ల స్థలాలు దక్కగా,ప్రస్తుత ప్రభుత్వంలో



ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.త్వరలోనే జిల్లా కార్యవర్గాలను ఏర్పాటు చేసి,జిల్లా స్థాయి సదస్సులతో పాటు రాష్ట్ర స్థాయి మహాసభలు ఘనంగా నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.అనంతరం జిల్లా జర్నలిస్టులు అల్లం నారాయణను ఘనంగా సన్మానించగా,ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొట్టె సదానందం, టీయూడబ్ల్యూజే నేషనల్ కౌన్సిల్ మెంబర్ అంకరి ప్రకాష్,నాయకులు కాల్వ రమేష్,నరేంద్ర చారి,శిలారపు కిషన్,కొయ్యడ తిరుపతి,తూర్పాటి శ్రీనివాస్,దొమ్మటి రాజేష్,కత్తెర్ల తిరుపతి,తిర్రి తిరుపతి,వేకల సంతోష్,కళ్యాణ్,సతీష్,తిర్రి సుధాకర్,లక్ష్మణ్,తిర్రి శంకర్, అంజయ్య,రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యలకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలి

**రోడ్లపై పశువుల సంచారానికి అడ్డుకట్ట వేయండి - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి,అక్టోబర్ 08:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అన్ని జంక్షన్లను సమగ్రంగా అధ్యయనం చేసి,అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో డీసీపీ రామ్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని అన్ని ప్రధాన జంక్షన్లను క్షేత్రస్థాయిలో సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు.ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీకి గల కారణాలను గుర్తించి,రద్దీ నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు అవసరమైన ప్రాంతాల్లో వన్‌వే,టూ-వే విధానాలను పరిశీలించి,నిబంధనల ప్రకారం ప్రయోగాత్మకంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ మార్పులను కనీసం ఒక వారం పాటు పరిశీలించి,ట్రాఫిక్ రాకపోకలపై వాటి ప్రభావం,ఫలితాలను అధ్యయనం చేసిన అనంతరం తగిన నిర్ణయం తీసుకోవాలని తెలిపారు.ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికలను నిబంధనల ప్రకారం రూపొందించి, అవసరమైన ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,ట్రాఫిక్ నియంత్రణలో పోలీసు, మున్సిపల్,రోడ్లు భవనాల శాఖల అధికారులు సమన్వయం తో పనిచేయాలని సూచించారు.రోడ్లపై ఆవులు,గేదెలు,ఇతర పశువులు సంచరించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున,వాటిని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పశువులను రోడ్లపైకి తీసుకురాకుండా స్థానిక సంస్థల అధికారులు,ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి,అక్కడ అవసరమైన మార్పులు, మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి రూపొందించే ప్రణాళికలను క్షేత్రస్థాయిలో పరిశీలించి,వాటి అమలు వల్ల వచ్చే ఫలితాలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.ఈ సమీక్షలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య,ఆర్ అండ్ బి ఈ ఈ భావ్ సింగ్,ట్రాఫిక్ పోలీసు అధికారులు,రోడ్లు భవనాల శాఖ అధికారులు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 5 మెగావోల్ట్ ఆంపియార్ ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభం



గొల్లపల్లి అక్టోబర్ 08 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి సబ్ డివిజన్ పరిధిలోని చిల్వకోడూరు సెక్షన్‌లో ఉన్న శేకల్ల సబ్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 5 మెగావోల్ట్ ఆంపియార్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ను జిల్లా విద్యుత్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు మాట్లాడుతూ నూతన మెగావోల్ట్ ఆంపియార్ ట్రాన్స్ ఫార్మర్ ను అందుబాటులోకి తీసుకురావడంతో శేకల్ల సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా సామర్థ్యం,నాణ్యత మరింత మెరుగుపడటంతో పాటు, వినియోగదారులకు మెరుగైన అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలోజగిత్యాల డివిజన్ ఇంజనీర్ కొత్తూరి గంగారాం, విద్యుత్ అధికారులు జి. శ్రీనివాస్ ,పి. వరుణ్ కుమార్ విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి బిజెపి ఆధ్వర్యంలో మెగా రక్తదానం కార్యక్రమం

బెల్లంపల్లి, అక్టోబర్ 8, (ప్రజాకలం) ప్రతినిధి. దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మంచిర్యాల జిల్లా,బెల్లంపల్లి పట్టణంలోని తాపీ సంఘం భవనంలో 10వ తేదీ శనివారం రోజున మెగా రక్తదానం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే , బిజెపి రాష్ట్ర నాయకురాలు శ్రీదేవి, మంచిర్యాల జిల్లా బిజెపి తెలంగాణ మహిళ మోర్చా పాలసీ రీసెర్చ్ కో కన్వీనర్ నలుల సంగీత పేర్కొన్నారు.. ఉదయం 8 గంటలకు రక్తదానం శిబిరం ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు.ఎంతో మందికి రక్తం అవసరం ఉందని, ప్రజలు, నరేంద్ర మోడీ అభిమానులు పెద్ద ఎత్తున రక్తదానం లో పాల్గొని దేశ సేవలో భాగస్వాములు కావాలన్నారు..



# మెట్ పల్లి 25వ వార్డు కాంగ్రెస్ పార్టీ
## ఇన్చార్జిగా తుమ్మన పల్లి రాంప్రసాద్



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 8 (ప్రజాకలం): మెట్ పల్లి మున్సిపాలిటీ 25వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా తుమ్మలపల్లి రాంప్రసాద్ నియమితులయ్యారు. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా తుమ్మన పల్లి రాంప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి 25వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించిన జువ్వాడి నర్సింగరావుకు కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. 25వ వార్డులో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు కృషి చేస్తానని రాంప్రసాద్ తెలిపారు..ఈ నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ తుమ్మలపల్లి రాంప్రసాద్ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# ఓటు హక్కును కాపాడాలి
## -ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి




నిర్మల్ అక్టోబర్ 08 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న దీక్షకు వామపక్ష పార్టీలు మద్దతు తెలిపాయి.

ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొమ్మెన సురేష్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఫారం-6, ఓటర్ల జాబితా మార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు ప్రమేయం ఉందని జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నప్పటికీ, సుప్రీంకోర్టుకు దీనితో సంబంధం లేదని ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారని తెలిపారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించే చర్యలు జరుగుతున్నాయనే ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజధాని కేంద్రంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో రాహుల్ గాంధీతో పాటు ఇతర జాతీయ వామపక్ష పార్టీల నాయకులను అరెస్టు చేయడాన్ని సిపిఎం నిర్మల్ జిల్లా కమిటీ ఖండిస్తున్నదని తెలిపారు.

జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీ పి ఐ (ఎం ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కె. రాజన్న, సీ పి ఐ (ఎం ఎల్) పార్టీ జిల్లా కార్యదర్శి రాజు, సీ పి ఐ జిల్లా కార్యదర్శి బి. రమేష్, సిపిఎం పట్టణ కార్యదర్శి తొడసం శంభు, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్, పీడీఎస్ యు ల జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి హరిత, యు సి ఐ జిల్లా నాయకులు రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల మెడికల్ కాలేజీ విద్యార్థుల సమ్మె విరమణ

## డిసెంబర్ 15 నాటికి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని మంత్రుల హామీ



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 8 (ప్రజాకలం): జగిత్యాల మెడికల్ కాలేజీ విద్యార్థులు, వైద్యులు చేపట్టిన సమ్మెను గురువారం విరమించారు. వైద్య విద్యార్థుల సమస్యలపై రాష్ట్ర మంత్రులు, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆర్ఁడబీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరియు ఉన్నతాధికారులతో జరిగిన చర్చలు సానుకూలంగా సాగడంతో విద్యార్థులు సమ్మె విరమించేందుకు అంగీకరించారు.డిసెంబర్ 15వ తేదీ నాటికి మెడికల్ కాలేజీ భవనం, హాస్టల్ భవనాలు, ప్లేగ్రౌండ్, మెస్ తదితర మౌలిక వసతుల నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, వైద్య శాఖకు చెందిన అధికారులు విద్యార్థులతో నేరుగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకుని చర్చించారు.రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆర్ ఁ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫోన్ ద్వారా విద్యార్థులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలపై సంతృప్తి వ్యక్తం చేసిన మెడికల్ విద్యార్థులు, వైద్యులు సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. రేపటి నుంచి మెడికల్ కాలేజీలో తరగతులు, వైద్యుల విధులు యథావిధిగా కొనసాగనున్నాయి.నిర్మాణ పనులను నిర్దీత గడువులోగా పూర్తి చేసేందుకు ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, మెడికల్ కాలేజీ విద్యార్థుల ప్రతినిధులతో రేపు ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. పనుల పురోగతిని వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు కార్మికులను సమీకరించి, రాబోయే రెండు నెలల్లో నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.విద్యార్థులకు అవసరమైన విద్యా, వసతి, క్రీడా, భోజన తదితర మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అధికారులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి. రాజ గౌడ్, అదనపు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రమాదేవి, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుభాష్ కుమార్ వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నాలుగు రోజుల నిరాహార దీక్షకు ఫలితం.. ప్రేమే గెలిచింది

**-పెళ్లికి నిరాకరించిన ప్రియుడితోనే చివరకు వివాహం**

**-ప్రజా కలం కథనానికి స్పందన.. పెద్దల జోక్యంతో సమస్యకు పరిష్కారం**

**-మానవత్వం చాటిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**-మద్దతుగా నిలిచిన దళిత, ప్రజా సంఘాలు -మీడియా మిత్రులకు శ్రీదేవి కృతజ్ఞతలు**



అక్టోబర్ 8, ప్రజాకలం ప్రతినిధి, (వరంగల్ /వర్ధన్నపేట)

ప్రేమ కోసం నాలుగు రోజుల పాటు చేసిన నిరాహార దీక్షకు ఎట్టకేలకు ఫలితం దక్కింది. ప్రేమించిన వ్యక్తినే వివాహం చేసుకోవాలన్న పట్టుదలతో ప్రియుడి ఇంటి ఎదుట మౌన దీక్షకు దిగిన తుమ్మల శ్రీదేవి పోరాటం సుఖాంతమైంది. పెద్దల జోక్యంతో ఇరు కుటుంబాలు అంగీకరించడంతో ప్రేమికుల వివాహం జరిగింది. దీంతో నాలుగు రోజులుగా కొనసాగిన నిరాహార దీక్షకు తెరపడింది. గత కొంతకాలంగా ప్రేమించుకున్న యువతీయువకుల మధ్య కొన్ని అనివార్య కారణాలతో మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో వివాహానికి యువకుడు నిరాకరించడంతో శ్రీదేవి తనకు న్యాయం చేయాలంటూ అతని ఇంటి ఎదుట నిరాహార దీక్ష చేపట్టింది.విషయం తెలుసుకున్న దళిత,ప్రజా,కుల సంఘాలతో పాటు వివిధ వర్గాల వారు ఆమెకు మద్దతుగా నిలిచారు.

**ప్రజాకలం కథనంతో కదలిక**

ఈ వ్యవహారాన్ని ప్రజాకలం దినవత్రిక వెలుగులోకి తీసుకువచ్చి, బాధిత యువతికి న్యాయం చేయాలన్న డిమాండ్‌తో కథనాలను ప్రచురించింది. దీంతో ఈ వ్యవహారం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. సమస్య పరిష్కారానికి పెద్దలు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని పలువురు కోరారు.

**ఎమ్మెల్యే చొరవతో పరిష్కారం**

ఈ విషయం అధిష్టానం దృష్టికి వెళ్లడంతో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం స్పందించినట్లు సమాచారం. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చొరవ తీసుకుని సంబంధిత కుటుంబ పెద్దలతో మాట్లాడి పరిస్థితిని వివరించినట్లు తెలిసింది. భవిష్యత్‌లో ఇరు కుటుంబాలకు కలిగే మంచి చెడులను వివరించి, యువతీయువకుల వివాహానికి అంగీకరించేలా పెద్దలను ఒప్పించినట్లు పేర్కొన్నారు.అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆయూబ్ తదితరులు కూడా సమస్య పరిష్కారానికి సహకరించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పెద్దలు మానవతా దృక్పథంతో స్పందించడంతో వివాహం సజావుగా జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు.

**'ప్రేమే గెలిచింది'**

నాలుగు రోజుల పాటు కొనసాగిన నిరాహార దీక్ష చివరకు వివాహంతో ముగియడంతో 'అంతిమంగా ప్రేమే విజయం సాధించింది' అంటూ పలువురు వ్యాఖ్యానించారు. ఈ పరిణామంతో శ్రీదేవి కుటుంబ సభ్యులు, మద్దతుదారుల్లో ఆనందం వ్యక్తమైంది.

**అందరికీ కృతజ్ఞతలు**

తనకు అండగా నిలిచిన మీడియా మిత్రులు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, కుల సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రజలు, ప్రతి ఒక్కరికీ తుమ్మల శ్రీదేవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన సమస్యను ప్రజల ముందుకు తీసుకువచ్చి న్యాయం జరిగేలా కృషి చేసిన ప్రజాకలం దినపత్రికకు, ఎం.జె.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసునూరి మురళికి ఆమె కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు.ఈ ఘటనలో సమస్యను ఉద్రిక్తతలకు దారితీయకుండా చర్చల ద్వారా పరిష్కరించడంలో సహకరించిన ప్రతి ఒక్కరినీ పట్టణ ప్రజలు అభినందించారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు కాపా సుధాకర్ పిలుపు

## ఓటు హక్కుల సంరక్షణ కోసం ఖమ్మంలో భారీ నిరసన

### ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత అవసరం - కాపా సుధాకర్ డిమాండ్




తల్లాడ అక్టోబర్ 8, ప్రజా కలం న్యూస్

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించడంతో పాటు ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్ అన్నారు.ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు గురువారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి పునాది.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలని కాపా సుధాకర్ డిమాండ్ చేశారు. ఓటు బచావో దేశ్ బచావో నినాదంతో నిర్వహించిన ఈ నిరసనలో కాపా సుధాకర్ ప్రత్యేకంగా పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణ,ఓటర్ల హక్కుల సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం అత్యంత కీలకమని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం మరింత బలపడేలా చర్యలు ఉండాలని ఆయన కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఓటు హక్కుకు సంబంధించి అక్రమాలు, అవకతవకలకు పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోందని కాపా సుధాకర్ పేర్కొన్నారు. ఈ అంశాలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని, ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ఎన్నికల సంఘంపైనా ఉందన్నారు.కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పెవిలియన్ గ్రౌండ్ నుంచి జెడ్పీ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ఈ నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్‌తో పాటు సీపీఐ,సీపీఎం, సీపీఎం మాస్‌లైన్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ,ఆమ్ ఆద్మీ పార్టీ,తెలంగాణ జన సమితి తదితర పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జెండాలు చేతబట్టి నినాదాలు చేస్తూ భారీ ప్రదర్శన నిర్వహించారు.

# టీబీ నిర్మూలనకు సమష్టి కృషి అవసరం

## అదనపు కలెక్టర్ శ్రీరాములు - టీబీ రహిత బాటలో 80 గ్రామాలు సర్పంచులకు ప్రశంసాపత్రాలు



పెద్దపల్లి,అక్టోబర్ 08:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

టీబీ వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి చేస్తూ జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపికైన 80 టీబీ ముక్త్ గ్రామాలకు అదనపు కలెక్టర్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.ఈసందర్భంగా టీబీ వ్యాధి నియంత్రణ, అనుమానిత కేసుల గుర్తింపు,పరీక్షలు,చికిత్స,ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ టీబీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.టీబీ లక్షణాలు ఉన్న వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరీక్షలు నిర్వహించేలా వైద్య,ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు.రెండు వారాలకు మించి దగ్గు ఉండటం,జ్వరం,ఆకలి మందగించడం,బరువు తగ్గడం, రాత్రివేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకునేలా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు.టీబీ రోగులకు పూర్తి స్థాయిలో చికిత్స టీబీ నిర్ధారణ అయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు,మందులు సకాలంలో అందేలా చూడాలని అదనపు కలెక్టర్ సూచించారు.రోగులు చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా,వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయిలో మందులు వినియోగించేలా ఆరోగ్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.టీబీ రోగుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,అవసరమైన పరీక్షలు నిర్వహించి,చికిత్స పూర్తయ్యే వరకు వైద్య సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 80 గ్రామాలు టీబీ ముక్త్ గ్రామాలుగా ఎంపిక కావడం అభినందనీయమని అదనపు కలెక్టర్ అన్నారు.ఈ గ్రామాల్లో చేపట్టిన చర్యలను స్ఫూర్తిగా తీసుకుని జిల్లాలోని మిగిలిన గ్రామాలను కూడా టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు.గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు,అంగన్‌వాడీ సిబ్బంది,వైద్య సిబ్బంది,ప్రజాప్రతినిధుల సమన్వయంతో టీబీ అనుమానితులను గుర్తించి పరీక్షలకు పంపించాలని తెలిపారు.టీబీపై ఉన్న అపోహలను తొలగించి,వ్యాధి నిర్ధారణ అయిన వారికి కుటుంబ సభ్యులు,సమాజం నుంచి సహకారం అందేలా అవగాహన కల్పించాలని సూచించారు.టీబీ వ్యాధి నివారణ,లక్షణాలు, చికిత్స,ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు.ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.టీబీ రహిత గ్రామాలుగా ఎంపికైన గ్రామాల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో కూడా కొత్త కేసులను ముందుగానే గుర్తించడం,చికిత్స అందించడం,వ్యాధి వ్యాప్తిని అరికట్టడం వంటి చర్యలను నిరంతరం కొనసాగించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ వై.పవిత్ర,జిల్లా టీబీ నియంత్రణ విభాగం అధికారి కె.వి.సుధాకర్ రెడ్డి,రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు రాజగోపాల్,వైద్య సిబ్బంది,వివిధ మండలాల ఎంపీడీవోలు,పంచాయతీ సెక్రటరీలు,టీబీ రహిత గ్రామాల సర్పంచులు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యత

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు

### విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించిన సర్పంచ్

తల్లాడ, అక్టోబర్ 8 ( ప్రజా కలం న్యూస్ )

తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తల్లాడ గ్రామ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యత, రుచి, వడ్డింపు విధానాన్ని పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యత అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి విద్యలో రాణించగలరని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, భోజన తయారీ సమయంలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి గ్రామపంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.అనంతరం విద్యార్థులతో సర్పంచ్ ముచ్చటించి వారి చదువు, పాఠశాలలోని అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, నాయకులు జి.వి.ఆర్., ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఆపన్నులకు సాయం చేయడం సామాజిక బాధ్యత

## లయన్స్ క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్ అల్లంకి శ్రీనివాస్ - ఆటో డ్రైవర్‌కు కృత్రిమ కాలు కోసం 5వేల ఆర్థిక సాయం

పెద్దపల్లి,అక్టోబర్ 08:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పర్సనలైజ్డ్ సర్వీస్ డే ను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఎలైట్ ఆధ్వర్యంలో గురువారం ఓ ఆటో డ్రైవర్‌కు మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం అందించారు. పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన అరికెళ్ల రాములు ఆటో నడుపుతూ భార్య,ముగ్గురు పిల్లలతో కూడిన కుటుంబాన్ని పోషిస్తున్నారు.అయితే తీవ్ర అనారోగ్య సమస్యల కారణంగా ఆయన తన కుడి కాలును మోకాలి కింది భాగం వరకు కోల్పోయారు.నిత్య జీవితంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించి,తిరిగి జీవనోపాధి పొందడానికి కృత్రిమ కాలు అవసరం కావడంతో ఆయన లయన్స్ క్లబ్‌ను సంప్రదించారు.బాధితుడి పరిస్థితిని తెలుసుకున్న గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్, లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఎలైట్ చార్టర్డ్ ప్రెసిడెంట్,బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ ఎల్లంకి శ్రీనివాస్ వెంటనే స్పందించారు.కృత్రిమ కాలు ఏర్పాటుకు తన వంతు సహకారంగా రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని బాధితుడు రాములుకు అందజేశారు.ఈ సందర్భంగా ఎల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న తోటివారిని ఆదుకోవడం,సమాజంలో వెనుకబడిన వారికి చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని పేర్కొన్నారు.లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ప్రజాసేవలో ముందుంటుందని స్పష్టం చేశారు.ఈ సేవా కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఎలైట్ ప్రతినిధులు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సమాజ నిర్మాణం లో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

## - ఎం. బి. బి ఎస్,ఎన్ఐటి ఐఐటి విద్యార్థుల సన్మాన కార్యక్రమం లో ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ - ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నిర్మల్ అక్టోబర్ 08 (ప్రజా కలం ప్రతినిధి)

సమాజ నిర్మాణం లో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు..గురువారం భైంసా లోని ఎస్. ఎస్. జిన్నింగ్ ఇండస్ట్రీ లో అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 30మంది ఎం. బి. బి ఎస్ సాధించిన విద్యార్థులను,6గురు ఎన్. ఐ. టి. ఐఐటీ సాధించిన విద్యార్థులను, 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గం లో విద్యార్థులు పెద్ద మొత్తం లో ఎంబిబిఎస్ సీట్లు సాధించడంతోపాటు, కొంతమంది విద్యార్థులు ఎన్ఐటి ఐఐటీలో రాణించడం శుభపరిణమం అన్నారు.. చదువుతోనే నర్వతో ముఖాభివృద్ధి సాధించగలుగుతామని, ఇష్టపడి చదివి విద్యార్థులు అనుకున్న గమ్యానికి చేరుకోవాలన్నారు.. ప్రతి సంవత్సరం మరియు అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాల ను చేపట్టడం జరుగుతుందని చెప్పారు.. అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ఎల్లప్పుడు కోనసాగిస్తామన్నారు. నియోజకవర్గంలో విద్యారంగంపై ప్రధాన దృష్టికి సాధించడం జరిగిందని, అందులో భాగంగానే ముధోల్ లో దాదాపు 300 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, కుంటాల మండలం లో మోడల్ స్కూల్ ను తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా మార్చి తొమ్మిది కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. విద్యా, వైద్యం, రైతాంగానికి సాగునీరు అందించడమే తన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు మాట్లాడుతూ అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి భోజన్న, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, మున్సిపల్ చైర్మన్ తుమ్మెల దత్తాత్రి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, నాయకులు రమణ రావ్ తదితరులు పాల్గొన్నారు..



## కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది విధుల బహిష్కరణ

### న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతి



ప్రజాకలం ప్రతినిధి, చింతూరు, అక్టోబర్ 08:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన విధుల బహిష్కరణ, నిరసన కార్యక్రమాలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా పోలవరం జిల్లా చింతూరు డివిజన్ పరిధిలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట సుమారు 106 మంది వైద్య సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, రెగ్యులరైజేషన్ జరిగేంత వరకు 100 శాతం గ్రాస్ జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే న్యాయం చేయాలని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్లను చేతులు జోడించి వేడుకున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకులు జోగారావుతో పాటు వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి వాట్సాప్ గ్రీవెన్స్ సెల్ ప్రారంభం - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ అక్టోబర్ 08 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ జిల్లా ప్రజల సమస్యలను సులభంగా, వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రీవెన్స్ సెల్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులు, వినతుల కోసం ప్రతిసారీ కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేకుండా, ఇంటి వద్ద నుంచే తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా ఈ డిజిటల్ వేదికను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లా ప్రజలు తమ ఫి ర్యాదులను వాట్సాప్ నంబర్ 8317557897కు మెసేజ్ రూపంలో పంపవచ్చని తెలిపారు. ఫిర్యాదుతో పాటు సమస్యకు సంబంధించిన పూర్తి



వివరాలు, సమస్య ఉన్న ప్రదేశం, చిరునామా, అవసరమైన ఆధారాలు, ఫొటోలు పంపించాలని సూచించారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును ప్రత్యేక బృందం నమోదు చేసి, వెంటనే సంబంధిత శాఖాధికారులకు పంపిస్తుందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్దిష్ట కాలపరిమితిలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లా ప్రజలు ఈ వాట్సాప్ గ్రీవెన్స్ సెల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన ఫిర్యాదులను మాత్రమే ఈ నంబర్‌కు పంపించాలని, అనవసరమైన లేదా తప్పుడు సందేశాలను పంపవద్దని సూచించారు. 8317557897 నంబర్‌ను కేవలం వాట్సాప్ సేవల కోసం మాత్రమే వినియోగించాలని, ఈ నంబర్‌కు ఫోన్ కాల్స్ చేయరాదని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆయా శాఖల ఆధ్వర్యంలో పుష్కరాల పనులన్నీ పకడ్బందీగా పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా


నిర్మల్ అక్టోబర్ 08 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)గోదావరి పుష్కరాల సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులన్నింటినీ పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానం ఈవో కార్యాలయంలో పుష్కరాల పనుల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.బాసరలో జరుగుతున్న పనుల వివరాలను శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అధికారి తమ పరిధిలోని పనులను నిరంతరం పర్యవేక్షించాలని, గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, పార్కింగ్ వంటి సౌకర్యాలన్నీ కల్పించాలని ఆదేశించారు. పుష్కరాల నిర్మాణ పనులకు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఏవైనా ఉంటే, వెంటనే ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల కోసం విశాలమైన పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని, అలాగే భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, హార్టికల్చర్ అధికారి రమణ, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో ఖానాపూర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్..

### టింబర్ డిపో లైసెన్స్ రెన్యూవల్ కోసం రూ.12,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి..

నిర్మల్, అక్టోబర్ 08 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ జిల్లా ఖానాపూర్ రేంజ్ ఉ డివిజన్ కు చెందిన ఫారెస్ట్ సెక్షన్



ఆఫీసర్ ఐండ్ల రవీందర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం బాధితుడి టింబర్ డిపో లైసెన్స్ రెన్యూవల్ కోసం సెక్షన్ ఆఫీసర్ మొదట రూ.20,000 లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు వేడుకోవడంతో రూ.12,000కు బేరం కుదుర్చుకున్నాడు. "ఇన్స్పెక్షన్ కు వచ్చి, పై అధికారులకు రిపోర్టు పంపడానికి" ఈ డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో గురువారం ఏసీబీ అధికారులు వల పన్ని రూ.12,000 లంచం తీసుకున్న తర్వాత ఆ డబ్బును తన కారు టి ఎస్ 18హెచ్ 4772 లో దాచాడు. వెంటనే ఏసీబీ అధికారులు కారులో ఉన్న డబ్బులు స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కరీంనగర్ లోని ఎస్ పి ఈ, ఎ సి బి కేసుల ప్రత్యేక జడ్జి ముందు హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.ఫిర్యాదుదారునీ వివరాలు గోప్యంగా ఉంచామన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే టోల్ ఫ్రీ నంబర్ 1064 కు ఫోన్ చేయాలని, వాట్సాప్ 9440446106 కు మెసేజ్ చేయాలని డీఎస్పీ కోరారు.

## జక్కుల ఉషా ఆత్మకు శాంతి చేకూరాలి

### కుటుంబానికి అండగా ఉంటాను : మద్దిశెట్టి సామేలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: అక్టోబర్ 08: (ప్రజా కలం న్యూస్)

ప్రముఖ జర్నలిస్టు, సీనియర్ నాయకులు ఖాదర్ బాబా సతీమణి జక్కుల ఉషా అకాల మరణం చెందడం పట్ల ఎన్సీపీ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎన్డీఏ మహాకూటమి, ఎన్సీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మద్దిశెట్టి సామేలు తీవ్ర దిగ్భ్రాంతి,వ్యక్తం చేశారు.



**కుటుంబానికి అండగా మద్దిశెట్టి**

జక్కుల ఉష మరణ వార్త తెలుసుకున్న వెంటనే మద్దిశెట్టి సామేలు హుటాహుటిన వారి నివాసానికి చేరుకున్నారు. జక్కుల ఉషా చిత్రపటానికి పూలమాల వేసి, కన్నీటి నివాళులర్పించారు. అనంతరం తీవ్ర శోకంలో ఉన్న ఖాదర్ బాబా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఈ కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ జక్కుల ఉషా అకాల మరణం చాలా బాధాకరం ఆమె కేవలంఒక కుటుంబ సభ్యురాలుమాత్రమేకాదు, ఖాదర్ బాబా ప్రజా జీవితంలో, జర్నలిజం ప్రయాణంలో వెన్నుదన్ను గా నిలిచిన వ్యక్తి. ఆమె మరణం కుటుంబానికి, జర్నలిస్టు సమాజానికి తీరని లోటు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన**

"జక్కుల ఉషా పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను" అని మద్దిశెట్టి సామేలు పేర్కొన్నారు. ఈ సంతాప కార్యక్రమంలో ఎన్సీపీ, ఎన్డీఏ మహాకూటమి, ఎన్సీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని జక్కుల ఉషా నివాళులర్పించారు.

## అక్షయ బార్ లో పాము కాటుకు గురైన వృద్ధ మహిళ

### -అక్షయ బార్ పరిసరాల్లో అపరిశుభ్రతపై పట్టణ ప్రజల ఆగ్రహం.
### -చెట్లు, పొదలతో నిండిన ప్రాంగణం.. పక్కనే మైనారిటీ కళాశాల.
### -బార్ యాజమాన్య నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్.

అక్టోబర్ 8, ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని అక్షయ బార్‌లో పనిచేస్తున్న ఓ వృద్ధ మహిళ బుధవారం పాము కాటుకు గురైన ఘటన కలకలం రేపింది. బార్‌లో వంట సామగ్రిని శుభ్రం చేస్తున్న సమయంలో పాము కాటు వేసినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

**అస్తవ్యస్తంగా బార్ పరిసరాలు**

స్థానికుల ఆరోపణల ప్రకారం.. అక్షయ బార్ పరిసర ప్రాంతాలు చాలాకాలంగా అపరిశుభ్రంగా ఉండటంతో పాటు చెట్లు, పొదలు పెరిగి అస్తవ్యస్తంగా మారాయి. దీంతో పాములు, ఇతర విషపురుగులు సంచరించే పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొంటున్నారు. బార్‌లో పనిచేసే సిబ్బందికి రక్షణ కల్పించేలా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని స్థానికులు అంటున్నారు.

**పక్కనే విద్యాసంస్థ.. విద్యార్థుల్లో భయాందోళన**

అక్షయ బార్‌కు సమీపంలో మైనారిటీ విద్యాసంస్థ ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. బార్ పరిసరాల్లో పాములు, విషపురుగులు సంచరిస్తున్న పరిస్థితులు ఉంటే విద్యార్థుల భద్రతపైనా ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన




వ్యక్తం చేస్తున్నారు. రద్దీగా ఉండే పట్టణ ప్రాంతంలో ఇటువంటి పరిస్థితులు కొనసాగడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**యాజమాన్య నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి**

వృద్ధ మహిళ పాము కాటుకు గురైన ఘటనతోనైనా సంబంధిత అధికారులు స్పందించి అక్షయ బార్ పరిసరాలను పరిశీలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. బార్ పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే సంబంధిత యాజమాన్యంపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## మత్స్య సహకార సంఘంలో అంతర్గత విభేదాలు

### - కుల బహిష్కరణ చేసినందుకు రెండు వర్గాలుగా విడి పోయిన మత్స్య సహకార సంఘం కల్లెడ సభ్యులు
### - కల్లెడలో నూతన పెద్దమనుషుల నియామకం, కుల సంఘంలో సంచలనం



(వరంగల్/పర్వతగిరి) అక్టోబర్ 08, ప్రజాకలం ప్రతినిధి:

కల్లెడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో అంతర్గత వర్గపోరు పరాకాష్టకు చేరింది. సంఘంలో నెలకొన్న వివాదాలు, ఆరోపణల నడుమ మత్స్య సహకార సంఘంలో బుధవారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోని మత్స్య సహకార సభ్యులు ప్రత్యేకంగా ఒక గ్రూపుగా ఏర్పడి, సొసైటీకి సంబంధించి నూతన పెద్దమనుషులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం ప్రకారం నూతన పెద్దమనుషులుగా: 1.బొట్టు పెద్దమనిషి: చిరుత వీరయ్య, 2.సారుకోల పెద్దమనిషి: చిరుత శ్రీనివాస్, 3.గంగపుత్ర ప్రతినిధి: పూస చిన్న యాకయ్య లను ఏకగ్రీవంగా నియమించుకున్నారు. గురువారం నుంచి మత్స్య సహకార సంఘానికి సంబంధించిన ఏ కార్యక్రమమైనా, నిర్ణయాలైనా తమ గ్రూపు తరపున ఈ నూతన పెద్దమనుషుల సమక్షంలోనే జరుగుతాయని, సభ్యులందరూ తమ స్వచ్ఛంద ఇష్టపూర్వక సమ్మతితోనే ఈ నిర్ణయం తీసుకున్నారని ప్రతినిధులు స్పష్టం చేశారు.

వివాదాలు– విభేదాలు–తీవ్ర ఆరోపణలు:

ఇటీవల ఎన్నికైన కమిటీకి ప్రత్యామ్నాయంగా ఈ పెద్దమనుషుల మార్పు నిర్ణయం వెలువడటం గ్రామంలో తీవ్ర చర్చనీయాంశమైంది. స్వల్ప మెజార్టీతో ఓటమిపాలైన అభ్యర్థులను కుల బహిష్కరణ చేశారనే ఆరోపణలు రావడంతోనే నూతన పెద్దమనుషుల నియామకానికి శ్రీకారం చుట్టినట్లు మరో వర్గం ఆరోపిస్తోంది. అంతేకాకుండా కుల సంఘానికి చెందిన నిధులను సహకార సంఘం ఎన్నికల కోసం వృధా ఖర్చుల కోసం ఉపయోగించారని ఈ వర్గీయులు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. ఈ కార్యక్రమంలో బోనగిరి దుర్గేష్, చిరుత ప్రసాద్, చేలకలపల్లి వెంకటయ్య, పిండి సారంగపాణి, బోనగిరి యాకయ్య, పిట్టల రాజు, పులుగుజ్జు రాజు, బోనగిరి ఎల్లయ్య, పులిగుజ్జు ఉప్పలయ్య, కాగితం రాజు, బండారి ప్రశాంత్, చిరుత సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు. అంతర్గత వర్గపోరుతో నూతన ఆలోచనలకు శ్రీకారం చుట్టిన ఈ వర్గం నిర్ణయంపై కల్లెడ మత్స్య సహకార సంఘంలో రాజకీయం మరింత వేడెక్కింది. రానున్న రోజుల్లో ఈ వివాదం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.

## క్రీడా స్ఫూర్తిని చాటాలి: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

### జేపీఎన్సీలో ఘనంగా ప్రారంభమైన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలు

### యువత క్రీడల్లో రాణించాలి: ఎంపీ శ్రీమతి డీకే అరుణ - 24 రాష్ట్రాల నుంచి హాజరైన 250 మంది బాక్సర్లు

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 08: క్రీడల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడమే అత్యంత ముఖ్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లి యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి అన్నారు. జిల్లా కేంద్రంలోని జేపీఎన్సీ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను మహబూబ్‌నగర్ ఎంపీ శ్రీమతి డీకే అరుణ తో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాక్సింగ్ ఎంతో కఠినమైన క్రీడ అని, శారీరక దారుఢ్యంతో పాటు అపారమైన మానసిక స్థైర్యం, క్రమశిక్షణ అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తూ అవసరమైన సకల సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. దేశంలోని 24 రాష్ట్రాల నుంచి విచ్చేసిన 250 మంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటి, అంతర్జాతీయ వేదికలపై దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని ఆయన ఆకాంక్షించారు. నిర్వాహకులను, క్రీడాకారులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గౌరవ ఎంపి లిశ్రీమతి డీకే అరుణ లి మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ గడ్డపై ఇలాంటి ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి పోటీలు జరగడం శుభపరిణామమని అన్నారు. ఇటువంటి టోర్నమెంట్ వలన స్థానిక యువత ప్రేరణ పొందాలని సూచించారు. అంతకుముందు అతిథులు జాతీయ పతాకాన్ని, బాక్సింగ్ ఫెడరేషన్ జెండాను ఆవిష్కరించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రింగ్‌లో పంచ్‌లు వేసి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి రాకేశ్ భరద్వాజ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రఘువీర్ సింగ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, జేపీఎన్సీ చైర్మన్ కేఎస్ రవికుమార్, మహబూబ్‌నగర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజు గౌడ్, కళాశాల అధ్యాపకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజల ఆరోగ్యమే లక్ష్యం

### - ప్రతి మంగళ, గురువారాల్లో ఉచిత షుగర్,బీపీ పరీక్షలు
### - ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష




తల్లాడ అక్టోబర్ 8 ప్రజా కలం న్యూస్

గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం, గురువారం గ్రామాల్లో ప్రత్యేక హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి నిర్వహించే ఈ వైద్య శిబిరాల్లో ప్రజలకు షుగర్,బీపీ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు అందజేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. తల్లాడ గ్రామపంచాయతీ పరిధిలోని కమ్మరి బజార్లో గురువారం నిర్వహించిన హెల్త్ క్యాంపులో పలువురు ప్రజలకు షుగర్,బీపీ పరీక్షలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య పరిస్థితిపై అవగాహన కల్పించి, వైద్యుల సూచనల మేరకు మందులు అందజేశారు.షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులపై ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ హెల్త్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ప్రత్యూష తెలిపారు. ప్రతి మంగళవారం, గురువారం ఉదయం 8 గంటలకు జరిగే ఆరోగ్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష, ఏఎన్ఎం కుమారి, పీహెచ్ సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

### - నెలకు రూ.5 వేల గౌరవ వేతనం.. క్వింటాల్‌కు రూ.300 కమిషన్ ఇవ్వాలి
### - ప్రజాసేవ చేసి పస్తులువుంటున్న రేషన్ డీలర్స్
### - రేషన్ డీలర్ల వర్ధన్నపేట మండల ప్రచార కార్యదర్శి ఎర్ర శ్రవణ్‌కుమార్

అక్టోబర్ 08, ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)



రేషన్ డీలర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రేషన్ డీలర్ల వర్ధన్నపేట మండల ప్రచార కార్యదర్శి ఎర్ర శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం జిల్లా,మండల రేషన్ డీలర్స్ ఐకమత్యం తో ఉద్యమం నిర్వహించాలని, రేషన్ డీలర్లకు నెలకు కనీసం రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాల్‌కు రూ.300 కమిషన్ అందించాలని కోరారు. ప్రజలకు నిత్యావసర సరుకులను నిరంతరం పంపిణీ చేస్తూ ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా రేషన్ డీలర్లు పనిచేస్తున్నారని తెలిపారు. అయితే తమకు అందుతున్న కమిషన్ సరిపోక ఆర్థిక ఇబ్బందులుఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.డీలర్ల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు. తమ హక్కుల సాధన కోసం రేషన్ డీలర్లు ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు."మన హక్కుల కోసం.. మన భవిష్యత్తు కోసం.. తొలి అడుగు వరంగల్, వర్ధన్నపేట నుంచే" అని ఎర్ర శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లు ఐకమత్యం తో కార్యక్రమాలు చేపట్టి హాజరై తమ ఐక్యతను చాటాలని ఆయన కోరారు.

## అడపా అనిల్ ఆధ్వర్యంలో భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

తల్లాడ అక్టోబర్ 8 ప్రజా కలం న్యూస్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం నాయకులు, తల్లాడ మండలంలోని నూతనకల్ గ్రామానికి చెందిన అడపా అనిల్ చౌదరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. గురువారం అన్నారుగూడెం గ్రామంలో సిరిపురం మేజర్ కు సంబంధించిన సాగర్ జలాలను ప్రారంభించేందుకు నత్తువల్లి



శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఆయన ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వార్డు మెంబర్లు, రైతులు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వారందరూ ఎమ్మెల్యేలతో కలిసి ప్రత్యేకంగా మాట్లాడారు. తమ గ్రామాల పరిధిలో సాగర్ జలాలను విడుదల చేసిన ఎమ్మెల్యేకు వారు ధన్యవాదాలు తెలిపారు.

## రైతు పొలానికి యంత్రబలం.. 50 శాతం రాయితీపై మినీ ట్రాక్టర్

తానూర్, అక్టోబర్ 8(ప్రజా కలం): రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో యాంత్రీకరణను పెంచుకోవాలని అధికారులు సూచించారు,ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీపై గురువారం బైంసాలో మండలంలోని హజ్గుల్ గ్రామానికి చెందిన రైతు కత్తులవార్ దేవేందర్‌కు మినీ ట్రాక్టర్‌ను అందజేశారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, వైస్ చైర్మన్ చేతుల మీదుగా మినీ ట్రాక్టర్‌ను పంపిణీ చేశారు. ఉద్యాన పంటల సాగులో యంత్ర పరికరాల వినియోగంతో రైతులకు కూలీల ఖర్చు, సమయం ఆదా అవుతుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి బి.వి. రమణ, డివిజనల్ ఉద్యానవన అధికారి జావిద్ పాషా, ఉద్యాన విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# విద్యా వాలంటీర్లు ప్రతి విద్యార్థిలో దాగిన ప్రతిభను వెలికితీయాలి

## ప్రతి పాఠశాలలో 20-30 మంది ప్రతిభావంతులను గుర్తించాలి - ఏఐ, ట్యాబ్‌లతో విద్యార్థుల అభిరుచులు, లక్ష్యాల డిజిటల్ నమోదు

## పదేళ్లపాటు కొనసాగనున్న 'విద్యా యజ్ఞం: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




మహబూబ్ నగర్
ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 08:

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న సహజ ప్రతిభను గుర్తించి, వారి అభిరుచులు, ఆసక్తులకు అనుగుణంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత విద్యా వాలంటీర్లపై ఉందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో శతశాతం విద్యా వాలంటీర్లతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన జిల్లా కలెక్టర్, నగర మేయర్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని (100 మంది విద్యా వాలంటీర్లకు ఒక్కొక్కరికి ?10,000 చొప్పున)గౌరవ వేతనాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేవలం పాఠాలు బోధించడంతో తమ బాధ్యత పూర్తయిందని భావించకుండా, విద్యార్థులకు మార్గదర్శకులుగా, మెంటర్లుగా నిలవాలని సూచించారు. మహబూబ్‌నగర్‌లో చేపడుతున్న విద్యా వాలంటీర్ కార్యక్రమం రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా విస్తరించాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. ఇతర జిల్లాల కలెక్టర్లకు కూడా ఈ కార్యక్రమం గురించి వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి విద్యా కార్యక్రమాలు విస్తరించేలా కృషి చేయాలని కోరారు. ఇతర అధికారిక కార్యక్రమాలు ఉన్నప్పటికీ విద్యా వాలంటీర్లను ప్రోత్సహించేందుకు కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యా వాలంటీర్లకు అందుతున్న గౌరవ వేతనం కేవలం ఆర్థిక ప్రోత్సాహకం మాత్రమే కాదని, పిల్లలకు సేవ చేసే అవకాశం లభించిందనే భావనతో వారు ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వాలంటీర్లు చేపడుతున్న కార్యక్రమాల వివరాలను వందే మాతరం ఫౌండేషన్ సమన్వయకర్త రవీందర్ రెడ్డి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారని తెలిపారు. విద్యా వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని ఒక 'విద్యా యజ్ఞం'గా భావించి నిబద్ధతతో పనిచేస్తున్నారని, వారి పట్టుదల, సేవాభావం అభినందనీయమని అన్నారు.

మహబూబ్‌నగర్ ఫస్ట్ ద్వారా గత ఏడాది కాలంగా మహిళలకు వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆరు బ్యాచ్‌లలో సుమారు 2500 మందికి శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణ సమయంలో మహిళల్లో కనిపించిన పట్టుదల, బాధ్యత తీసుకుని పనిచేసే సామర్థ్యం, ఆలోచనా విధానం తమకు విశ్వాసాన్ని కలిగించాయని అన్నారు. మహిళలకు బాధ్యత అప్పగించి, తగిన ప్రోత్సాహం అందిస్తే అద్భుతమైన ఫలితాలు సాధిస్తారనే నమ్మకం కలిగిన తర్వాతే ఇంత విస్తృతమైన విద్యా వాలంటీర్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారని, వారి ప్రతిభను గుర్తించి సరైన దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. తల్లిదండ్రులు జీవనోపాధి కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులకు వెళ్లే పరిస్థితుల్లో పిల్లల ప్రత్యేక ఆసక్తులు, అభిరుచులను గమనించే అవకాశం లేకపోవచ్చని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కూడా తమ బోధనా బాధ్యతల్లో నిమగ్నమై ఉండే పరిస్థితుల్లో విద్యా వాలంటీర్లు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి పాఠశాలలో కనీసం 20 నుంచి 30 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, వారి ఆసక్తులు, అభిరుచులు, నైపుణ్యాలు, భవిష్యత్తు లక్ష్యాలను తెలుసుకోవాలని అన్నారు. వారితో కొంత సమయం గడిపి, ఏ రంగంలో రాణించగలరో గుర్తించి వివరాలను నమోదు చేయాలని సూచించారు. నైపుణ్యం ఉన్న ఏ ఒక్క విద్యార్థి కూడా సరైన ప్రోత్సాహం లేక వెనుకబడకూడదని, ప్రతిభ ఉన్న ప్రతి బిడ్డకు అండగా నిలిచి వారి కలలను సాకారం చేసుకునే దిశగా చేయూతనివ్వడమే విద్యా వాలంటీర్ వ్యవస్థ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కార్యక్రమాన్ని రూపొందించనున్నట్లు యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ట్యాబ్‌ల ద్వారా విద్యార్థుల అభిరుచులు, ఆలోచనలు, లక్ష్యాలు, భవిష్యత్తులో ఏమి కావాలనుకుంటున్నారనే అంశాలను ప్రశ్నావళి రూపంలో నమోదు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి వివరాలను డిజిటల్‌గా భద్రపరిస్తే, భవిష్యత్తులో వారికి అవసరమైన సమయంలో ఉన్నత విద్య, కెరీర్ మార్గదర్శకత్వం, ఇతర సహాయాన్ని అందించేందుకు వీలవుతుందని తెలిపారు. విద్యా వాలంటీర్లు నెలకు ఒకసారి పాఠశాలకు వెళ్లి తమ బాధ్యతను పూర్తి చేసే సాధారణ కార్యక్రమం ఇది కాదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిర్దిష్ట లక్ష్యంతో ప్రారంభించిన దీర్ఘకాలిక 'విద్యా యజ్ఞం' గా దీనిని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. విద్యా వాలంటీర్లు, జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, వందే మాతరం ఫౌండేషన్, మహబూబ్‌నగర్ ఫస్ట్ బృందం, ఉపాధ్యాయులు, మీడియా ప్రతినిధులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాబోయే పది సంవత్సరాల పాటు ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తూ, మహబూబ్‌నగర్‌లోని ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి నాణ్యమైన విద్య, సరైన మార్గదర్శకత్వం, ప్రతిభకు తగిన ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన అన్నారు.జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తా గారు మాట్లాడుతూ విద్యా వాలంటీర్లకు గౌరవ వేతనం అందజేయడం ఎంతో సంతోషకరమైన విషయమని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తా గారు అన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యా వాలంటీర్లు, ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. పిల్లలకు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, బియాండ్ ది బుక్స్ వెళ్లి బోధించేందుకు వాలంటీర్లు చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. కార్డులు, డిజిటల్ ట్యాబ్‌లు తదితర ఆధునిక బోధనా పద్ధతులను ఉపయోగిస్తూ విద్యార్థులు విషయాలను సులభంగా, ఆచరణాత్మకంగా నేర్చుకునేలా చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయమన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదిగినప్పుడు తమకు బోధించిన ఉపాధ్యాయులు, వాలంటీర్లను తప్పకుండా గుర్తు చేసుకుంటారని అన్నారు. వాలంటీర్ల సేవలతో పిల్లల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెరుగుతున్నాయని పేర్కొన్నారు. తమ చేతికి గౌరవ వేతనం అందిన ఈరోజు అనుభూతిని వాలంటీర్లు నెలంతా గుర్తు పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహం వెనుక ఉన్న ఉద్దేశాన్ని అర్థం చేసుకుని, పిల్లల భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేయాలని కోరారు. విద్యార్థులు భవిష్యత్తులో స్కాలర్‌షిప్‌లు సాధించి, ఉన్నత విద్యను అభ్యసించి మంచి కళాశాలలకు వెళ్లే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వాలంటీర్లకు బోధనలో ఎదురయ్యే ఆచరణాత్మక సమస్యలను పరస్పరం చర్చించుకోవాలని శ్రీమతి ఖుష్బూ గుప్తా గారు సూచించారు. కొంతమంది విద్యార్థులకు పాఠాలు అర్థం కాకపోవడం, మరికొందరు తరగతిలో ఆసక్తి చూపకపోవడం వంటి సమస్యలు ఎదురైతే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను సంప్రదించి వారి సూచనలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ఎదురయ్యే పరిస్థితులపై కూడా వాలంటీర్లు తమ అనుభవాలను పరస్పరం పంచుకుంటే అందరి జ్ఞానం, అనుభవం మరింత పెరుగుతుందని, తద్వారా విద్యార్థుల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన కలెక్టర్, విద్యా వాలంటీర్లందరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, వాలంటీర్లు చేస్తున్న కృషి మరింత మంది స్ఫూర్తి పొందేలా ఉండాలని, పిల్లల భవిష్యత్తు కోసం అందరూ మరింత అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ రవీందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ సమన్వయకర్త రవీందర్ రెడ్డి,మహబూబ్‌నగర్ ఫస్ట్ ఇంచార్జీ నిజలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

# భవిత కేంద్రం ప్రారంభం

## జడ్పీహెచ్ఎస్ , కేజీబీవీ పాఠశాలలు పరిశీలన..

## ఇంద్రమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ- ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్



నిర్మల్ అక్టోబర్ 08 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కుబీర్ మండల కేంద్రంలో ముధోల్ నియోజక వర్గ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, విద్య, మౌలిక వసతులు, పేదల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కుబీర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, విద్యాసంస్థలను పరిశీలించడంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు ఇంద్రమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.

కుబీర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేంద్రాన్ని ప్రారంభించారు.

అనంతరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే సరస్వతి దేవి ఆశీస్సులు స్వీకరించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, పాఠశాల నిర్వహణ, మౌలిక వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, వారికి నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ మహోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులతో సందడి చేశారు. విద్యార్థులు సంప్రదాయబద్ధంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలను తిలకించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేసి అభినందించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలతో పాటు హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజనం, వసతి సౌకర్యాలు, విద్యాబోధన తదితర అంశాలపై ఆరా తీశారు. పాఠశాల కోసం నిర్మించనున్న తరగతి గదులు, భవన నిర్మాణ ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్‌తో మాట్లాడి పాఠశాల, హాస్టల్‌కు సంబంధించిన సమస్యలను తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.

అనంతరం కుబీర్‌లో నిర్మించనున్న వీఓ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి మహిళా డ్వాక్రా సంఘాలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.

కుబీర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన ఇంద్రమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇళ్ల మంజూరు పేరుతో దళారులను ఆశ్రయించి డబ్బులు చెల్లించవద్దని ఎమ్మెల్యే లబ్ధిదారులకు సూచించారు. ఇళ్లు మంజూరు చేయిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే వారి మాటలు నమ్మవద్దని, వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు సైతం అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. గజిటెడ్ వెరిఫికేషన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించి, అర్హత ఉన్న నిజమైన పేదలకే ఇళ్ల మంజూరు జరిగేలా చూడాలని ఆదేశించారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు తన దృష్టికి తీసుకువస్తే వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే కుబీర్ మండలం అభివృద్ధిలో వెనుకబడిందని ఎమ్మెల్యే విమర్శించారు. గతంలో అధికారంలో ఉండి మండల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టని వారు ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీలో చేరి అభివృద్ధికి ఆటంకాలు సృష్టించడం సమంజసం కాదన్నారు. ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రోటోకాల్‌ను విస్మరించి ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదని, ప్రజలు జరుగుతున్న ప్రతి పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమాల్లో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు, ఉపాధ్యాయులు, కేజీబీవీ సిబ్బంది, విద్యార్థులు, ఇంద్రమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలకు ఘన చరిత్ర

## కళాశాలలో వైభవంగా ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

## విద్యార్థినులకు యూపీఎస్సీ శిక్షణ, నూతన కోర్సులు అందుబాటులోకి

## వచ్చే ఏడాది కళాశాలకు రూఫ్ టాప్ నిర్మాణం - ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 08:

స్థానిక ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, మహిళా విద్యారంగంలో నాణ్యమైన విద్యను అందిస్తూ ఈ కళాశాల ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలంగాణ ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి పేర్కొన్నారు. దసరా నవరాత్రులను పురస్కరించుకొని కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల యాజమాన్యంతో పాటు విద్యార్థినులకు, ఉపాధ్యాయులకు దసరా, బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1988లో ప్రారంభమైన ఈ చారిత్రక విద్యాసంస్థ ద్వారా ఇప్పటివరకు వేలాది మంది గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థినులు విద్యనభ్యసించి వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని కొనియాడారు. ఉన్నత విద్య కోసం స్థానిక ఆడబిడ్డలు హైదరాబాద్ వంటి మహానగరాలకు వెళ్లకుండా, స్థానికంగానే అత్యుత్తమ ప్రమాణాలతో డిగ్రీ విద్యను అందించడంలో ఈ కళాశాల కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రతి ఏటా కళాశాలలో దసరా వేడుకలను ఒక పండుగలా గత 15 సంవత్సరాలుగా వైభవంగా నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందని, ఈ ఏటా కూడా ఎన్ఎస్‌యూఐ, కళాశాల యాజమాన్యం సమన్వయంతో సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కళాశాలలో ఇప్పటికే నూతన జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రవేశ ప్రవేశపెట్టడం జరిగిందని, మరికొన్ని కొత్త కోర్సులు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. దేశంలోనే అత్యున్నత సర్వీసులైన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలకు అవసరమైన ప్రత్యేక శిక్షణను కూడా కళాశాల విద్యార్థినులకు స్థానికంగానే అందించేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. అంతేకాకుండా, విద్యార్థినుల సౌకర్యార్థం వచ్చే ఏడాది కళాశాలకు పక్కా రూఫ్ టాప్ (పైకప్పు) ఏర్పాటు చేయిస్తామని, అందుకు ఎంత ఖర్చైనా భరించేందుకు తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి,ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, ఎన్ ఎస్ యు ఐ నాయకులు ముకుందం రమేష్, శివజోగి, అనుప శేఖర్ , నాయకులు అవేజ్, ఎన్ పి నేహా శ్రీ, కృష్ణకాంత్ రెడ్డి, సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అధ్యాపక బృందం, తో పాటు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొని బతుకమ్మ పాటలతో సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

## సిరిపురం మేజర్ కు సీతారామ జలాలు విడుదల చేసిన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్



తల్లాడ. అక్టోబర్. 8 ప్రజా కలం న్యూస్

తెలంగాణ రాష్ట్రంలో రైతులందరికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో సీతారామ ప్రాజెక్టు ద్వారా విడుదలైన సాగర్ జలాలను అన్నారుగూడెం వద్ద ఆమె లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం కోటి ఎకరాలకు సాగునీరు అందిస్తామని ఊకదంపుడు ప్రసంగాలు చేసి ఒక్క ఎకరంకు కూడా సాగునీరు ఇవ్వలేదని ఎద్దేవ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వందలాది క్యూసెక్కుల నీటిని తీసుకొచ్చి రైతన్నలకు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు సాగర్ కాలువ మరమ్మత్తుల కారణంగా కొంత ఆలస్యమైనదని, ఇకనుంచి దండిగా సాగర్ జలాలు వస్తాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులందరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డికి అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అన్నారుగూడెం గ్రామ అభివృద్ధికి ఇప్పటికే కోట్లాది రూపాలు నిధులు వెచ్చించామని, రానున్న రోజుల్లో సైడ్ డ్రైనేజీలు, స్మశాన వాటిక తదితర అభివృద్ధి పనులకు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను అన్నారుగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్, గ్రామ మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత, మల్లికార్జున్ రావు దంపతులు, జిల్లా నాయకులు మారెళ్ళ లక్ష్మణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కోసూరి వెంకటేశ్వరరావు శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగు నూరు లక్ష్మారెడ్డి ఎన్ ఎస్ పి అధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల గ్రామ నాయకులు కార్యకర్తలు రైతులు, అంగన్వాడి సిబ్బంది పంచాయతీ సిబ్బంది, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లాడలో స్మార్ట్ కార్డులు పంపిణీ.. తల్లాడ పట్టణంలో నూతన స్మార్ట్ కార్డులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గారు చేతులమీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సన్నబియ్యం అందిస్తూ పేద వర్గాలకు అండగా ఉంటున్నామని తెలిపారు. ప్రజలు మరోసారి ఆదరించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి, తహసిల్దార్ కరుణాకర్ రెడ్డి, నాయకులు మోకర ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతలపై దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ: హున్నుందే పుండలిక్



తానూర్, అక్టోబర్ 08 (ప్రజా కలం): ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలపై కేంద్ర ప్రభుత్వం దౌర్జన్యంగా లాఠీఛార్జ్ చేయించడాన్ని తానూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హున్నుందే పుండలిక్ తీవ్రంగా ఖండించారు, ముధోల్ ఇన్చార్జి బోస్లే నారాయణరావు పటేల్ ఆదేశాల మేరకు గురువారం తానూర్ మండల కేంద్రంలో నిరసన ప్రదర్శన చేపట్టి, తహసీల్దార్ మహేందర్ నాథ్‌కు వినతిపత్రం అందజేశారు,ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతు... "ఎన్నికల సంఘం జవాబుదారీతనం కోరుతూ శాంతియుతంగా వెళ్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎంపీలపై దాడి చేయడం దారుణం. ప్రజాప్రతినిధులపై జరిగిన ఈ దాడి రాజ్యాంగంపై జరిగిన దాడే, అందుకే ఈ రోజును 'బ్లాక్ డే'గా నిరసిస్తున్నాం" అని పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మణ్, మారుతి పటేల్, నాయకులు చంద్రకాంత్ యాదవ్, గోవింద్ పటేల్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సాక్షిగా కాంగ్రెస్ ఇంచార్జి కోసూరు వెంకటేశ్వర్లకు అవమానం



తల్లాడ ఆగస్టు 8 ప్రజా కలం న్యూస్ సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ గారి సాక్షిగా కాంగ్రెస్ పార్టీ కల్లూరు పట్టణ ఇన్చార్జి, తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కోసూరు వెంకటేశ్వర్లుకు అవమానం జరిగింది. గురువారం తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో సీతారామ ప్రాజెక్ట్ నీటిని విడుదల చేసేందుకు సత్తుపల్లి ఎమ్మెల్యే గారు హాజరయ్యారు. సాగర్ జలాలు ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో కోసూరి వెంకటేశ్వర్లు అవమానం జరిగింది. గ్రామంలో ఉన్న మాజీ ప్రజాప్రతినిధులను, ఫోటోకాల్ లేని నాయకులను స్టేజి మీదకి పిలిపించి జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు, కల్లూరు కాంగ్రెస్ పార్టీ పట్టణ ఇన్చార్జి, స్వగ్రామానికి చెందిన కోసూరు వెంకటేశ్వర్లును మాత్రం స్టేజి మీదకు ఆహ్వానించలేదు. దీంతో ఆయన ఎమ్మెల్యే సమక్షంలోనే నేను బీసీ నాయకుడినీ, నన్నెందుకు పిలవలేదు అని ప్రశ్నిస్తున్నప్పటికీ సభ అధ్యక్షతన వహిస్తున్న తుమ్మలపల్లి రమేష్ మాత్రం స్టేజి మీదకు పిలవలేదు. దీంతో ఇరువురు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. చివరకు ఆయన ముగిస్తుండగా అప్పుడు స్టేజి మీదకు పిలవటంతో తనకు అవమానం జరిగిందని కోసూరు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా పార్టీ అధ్యక్షులు వారికి ఫిర్యాదు చేస్తానని, ఫోటో కాల్ పాటించని నాయకులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## తానూర్ వాసవి పాఠశాలలో వైభవంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు




తానూర్,అక్టోబర్ 8(ప్రజా కలం): తానూర్ మండల కేంద్రంలోని వాసవి ప్రాథమిక పాఠశాలలో దసరా సెలవుల సందర్భంగా గురువారం బతుకమ్మ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు, విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక పూజలు చేశారు, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ పూజా కార్యక్రమాలు నిర్వహించి సంబరాలను ప్రారంభించారు,అనంతరం విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మ చుట్టూ చేరి బతుకమ్మ పాటలతో ఉత్సాహంగా ఆడారు,ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డిని సన్మానించిన ఎమ్మెల్యే రాగమయి

తల్లాడ అక్టోబర్ 8 (ప్రజా కలం న్యూస్):

రాష్ట్రంలోనే ప్రముఖ కాంట్రాక్టర్ గా పేరు, ప్రఖ్యాతలు గాంచిన మొగిలి శ్రీనివాసరెడ్డి (ఎమ్మెస్సార్)ను సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సన్మానించారు. గురువారం తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో సీతారాం ప్రాజెక్ట్ సాగర్ జలాలు ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెస్సార్ ను ఆమె శాలువాలతో సన్మానించి సత్కరించారు. ప్రాజెక్ట్ పనులను సకాలంలో పూర్తిచేసి రైతులకు నీరు అందించినందుకు ఆయనను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.



# నిర్మల్‌లో మాంగళ్య షాపింగ్ మాల్ 34వ శాఖ ఘన ప్రారంభం

### సినీ నటి భాగ్యశ్రీ చేతుల మీదుగా ప్రారంభం.. నాణ్యమైన వస్త్రాలు సరసమైన ధరలకు అందుబాటులోకి

నిర్మల్, అక్టోబర్ 8 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి):

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో వస్త్ర వ్యాపార రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన మాంగళ్య షాపింగ్ మాల్ 34వ శాఖ నిర్మల్‌లో ఘనంగా ప్రారంభమైంది. 2012లో వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్ నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ వినియోగదారుల ఆదరణతో విస్తరిస్తోంది. నిర్మల్‌లో ఏర్పాటు చేసిన నూతన శాఖ ప్రారంభోత్సవానికి ప్రముఖ సినీ నటి భాగ్యశ్రీ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించారు. ఆమెను చూసేందుకు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. అభిమానులతో నటి భాగ్యశ్రీ ఉత్సాహంగా మమేకమయ్యారు.

ఈ సందర్భంగా నటి భాగ్యశ్రీ మాట్లాడుతూ.. నిర్మల్ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారన్న నమ్మకం ఉందన్నారు. ప్రజల ఆశీర్వాదాలతో ఈ శాఖ మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు మహేశ్వర్ రెడ్డి నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పల కావ్య గణేష్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గొడ్డం నగేష్ మాట్లాడుతూ నిర్మల్ పట్టణంలో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ మాల్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. నమ్మకం, విశ్వాసానికి మాంగళ్య ప్రతీకగా నిలుస్తోందని, ప్రజలు స్థానికంగానే షాపింగ్ చేయాలని కోరారు.

శాసనసభ్యులు ఏ. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిర్మల్ ప్రజలకు మాంగళ్య షాపింగ్ మాల్ రావడం అదృష్టమన్నారు. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు



కల్పించడం అభినందనీయమన్నారు. ఇకపై వస్త్రాల కొనుగోలు కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లా ఏర్పడిన తర్వాత ఇంత పెద్ద షాపింగ్ గ్రూప్ ఇక్కడ తన శాఖను ప్రారంభించడం అభినందనీయమన్నారు. నిర్మల్ ప్రజలకు మాంగళ్య షాపింగ్ మాల్ మరింత సౌకర్యవంతమైన షాపింగ్ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే తమ విజయ రహస్యమన్నారు. తమ స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా రూపొందిస్తూ వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నామని తెలిపారు.

మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, చిన్నారుల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్‌తో పాటు వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేకమైన భారీ వెడ్డింగ్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయని డైరెక్టర్లు తెలిపారు. రూ.99 నుంచి రూ.లక్ష వరకు వివిధ ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్ రాబోయే రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో మరో 10 కొత్త ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూడా విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని వెల్లడించారు. నిర్మల్‌లో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభంతో పెళ్లిళ్లు, శుభకార్యాల షాపింగ్ కోసం ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని నిర్వాహకులు తెలిపారు. నిర్మల్ ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి మాల్‌ను సందర్శించి కొత్త షాపింగ్ అనుభూతిని పొందాలని డైరెక్టర్లు కోరారు.

# సీనియర్ సిటిజన్ల హక్కులను పరిరక్షించాలి

### వృద్ధుల పట్ల గౌరవం, సంరక్షణ ప్రతి కుటుంబ బాధ్యత.. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రవీందర్

నిర్మల్, అక్టోబర్ 8 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి):

సీనియర్ సిటిజన్ల హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి అవసరమైన సౌకర్యాలు, భద్రత కల్పించాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులతో పాటు సమాజంపై ఉందని నిర్మల్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ రవీందర్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్మల్ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి రవీందర్ మాట్లాడుతూ.. కుటుంబంలో తల్లిదండ్రులు, తాతయ్య, అమ్మమ్మ వంటి సీనియర్ సిటిజన్లు ఉన్నప్పుడు వారిని చిన్నపిల్లల మాదిరిగా ప్రేమతో, బాధ్యతతో చూసుకోవాలని సూచించారు. వృద్ధుల సంరక్షణ కుటుంబ బాధ్యత మాత్రమే కాదని, అది సామాజిక బాధ్యత కూడా అని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి సీనియర్ సిటిజన్‌ను గౌరవించే సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కొంతమంది వృద్ధులు తమ ఆస్తులను పిల్లల పేర్లపై బదలాయించిన అనంతరం తగిన పోషణ, సంరక్షణ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఘటనలు తమ దృష్టికి వస్తున్నాయని తెలిపారు. సీనియర్ సిటిజన్ల హక్కులకు సంబంధించిన చట్టాలు, నిబంధనల ప్రకారం వారికి న్యాయం అందేలా చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. వృద్ధులను నిర్లక్ష్యం చేసే పరిస్థితులను సమాజం గుర్తించి వారికి అండగా నిలవాలని కోరారు. నిర్మల్ జిల్లా పరిధిలోని కమల్‌కోట్, లోలం, దిలావర్‌పూర్ మండలాలకు చెందిన కొందరు సీనియర్ సిటిజన్లు తమపై జరుగుతున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకువచ్చారని రవీందర్ తెలిపారు. సంబంధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేలా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

**సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి కృషి**

జిల్లా సంక్షేమ శాఖ అధికారి జి. వినూత్న మాట్లాడుతూ వయోవృద్ధుల గౌరవం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమాజంలో వారి క్రియాశీల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే ×ణ్యూ-2026 కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వృద్ధులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సి. లింగన్న మాట్లాడుతూ వయోవృద్ధుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తమ సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. సీనియర్ సిటిజన్ల హక్కులు, గౌరవం, భద్రత విషయంలో కుటుంబ సభ్యులు, అధికారులు, సమాజం సమన్వయంతో పనిచేయాలని కోరారు.

**సేవా ప్రస్థానానికి నిజాముద్దీన్‌కు సన్మానం**

కార్యక్రమంలో భైంసాకు



చెందిన సీనియర్ సిటిజన్, ఆర్‌అండ్‌బీ శాఖలో వాచ్‌మన్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన నిజాముద్దీన్‌ను ఘనంగా సన్మానించారు. భైంసా ఆర్‌అండ్‌బీ ఐబీలో దీర్ఘకాలం విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులకు సేవలందించిన ఆయన సేవలను గుర్తించి మెమెంటో, శాలువాతో సత్కరించారు. నిర్మల్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ రవీందర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జి. వినూత్న చేతుల మీదుగా నిజాముద్దీన్‌కు సన్మానం నిర్వహించారు. ఆయనతో పాటు పూతరెడ్డి కిష్టారావు, ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ ఉమేష్ గుప్తాలను కూడా సన్మానించారు.

సాధారణ స్థాయి ఉద్యోగంలో కొనసాగుతూ కుటుంబ బాధ్యతలను నిర్వర్తించి, సేవాభావంతో జీవించిన నిజాముద్దీన్ వంటి సీనియర్ సిటిజన్ల అనుభవాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని కార్యక్రమంలో పేర్కొన్నారు.

కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు బొజ్జ జనార్ధన్, సీనియర్ సిటిజన్లు, సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి అండగా నిలిచిన నాయకులు

### -మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం
### -మాజీ ఎంపీపీ పాండు గౌడ్ తదితరుల పరామర్శ



**గజ్వేల్ నియోజకవర్గం: అక్టోబర్ 8 (ప్రజా కలం ప్రతినిధి):** సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన అర్కల బిక్షపతి అనారోగ్యంతో మృతి చెందారు.

విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ పాండు గౌడ్, సర్పంచ్ భవాని బాలకిషన్, బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు మ్యకల కనకయ్య ముదిరాజ్, ఉపసర్పంచ్ జుట్టు సుధాకర్, వార్డు సభ్యుడు దండు కరుణాకర్ గురువారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన వారు,కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని కుటుంబానికి తమవంతు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## బీజేవైఎం నాగర్‌కర్నూల్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా బోల్గం నరేష్ గౌడ్ నియామకం

కడ్తాల్, అక్టోబర్ 07 (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మక్త మధారం గ్రామానికి చెందిన యువ నాయకుడు బోల్గం నరేష్ గౌడ్ కు భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం ) లో కీలక పదవి దక్కింది. ఆయనను నాగర్‌కర్నూల్ జిల్లా బీజేవైఎం కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా బోల్గం నరేష్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బీజేవైఎం నాగర్‌కర్నూల్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించినందుకు బీజేపీ సీనియర్ నాయకులు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు శ్రీ తల్లోజు ఆచారి అన్న గారికి తన హృదయపూర్వక కృతజ్ఞతలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు.తనకు అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా, నిబద్ధతతో నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజాసేవకు కట్టుబడి, ప్రజలకు అందుబాటులో ఉంటూ



సేవా కార్యక్రమాల్లో ముందుంటానని స్పష్టం చేశారు.నరేష్ గౌడ్ నియామకం పట్ల కడ్తాల్ మండల బీజేపీ నాయకులు, యువకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## గజ్వేల్‌లో కిమ్స్ సన్‌షైన్ వైద్య శిబిరం..

### 150 మందికి వైద్య సేవలు

### కిడ్నీ రోగులకు ఉచిత పరీక్షలు.. మందుల పంపిణీ

గజ్వేల్: అక్టోబర్ 8 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో గురువారం కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్, బేగంపేట--హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కిడ్నీ వైద్య శిబిరాన్ని



నిర్వహించారు.ఈ శిబిరంలో సుమారు 150 మంది కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగులకు వైద్య సేవలు అందించారు.ఈ సందర్భంగా కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కౌశిక్ శ్రీధర్,డాక్టర్ ప్రణీత్ రోగులను పరీక్షించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్యుల సూచనల మేరకు రోగులకు మందులను ఉచితంగా అందజేశారు.కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ,కిడ్నీ ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరాన్ని వైద్యులు వివరించారు.ఈ శిబిరంలో మార్కెటింగ్ టీమ్ సభ్యులు షేక్ మోయిన్,కాశమైన సందీప్ కుమార్,ఉదయ్,సుధీర్‌తో పాటు నర్సింగ్ సిబ్బంది,ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొని శిబిరం నిర్వహణలో సహకరించారు.



# ప్రమాదంగా మారిన పాలెం-ధర్మోరా రోడ్డు: పట్టించుకోని అధికారులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 08:

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం పాలెం-ధర్మోరా గ్రామాల మధ్య ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న పెద్ద వాగు చెక్ డ్యామ్ రోడ్డుతో పాటు, అక్కడ ఉన్న మలుపు (టర్నింగ్) ప్రస్తుతం



తీవ్ర ప్రమాదకరంగా మారాయి. నిత్యం వందలాది ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రధాన రహదారిపై ఇటీవలి వర్షాల కారణంగా పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారినా, మలుపు వద్ద ప్రమాద సూచికలు లేకపోవడంతో వాహనదారులు నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు అధ్వాన్నంగా మారినా సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించకముందే అధికారులు తక్షణమే స్పందించి, యుద్ధప్రాతిపదికన ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు మరియు పాలెం-ధర్మోరా గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# చక్కటి క్రమశిక్షణ.. మురిసిన తల్లిదండ్రులు!

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 08:


మోర్తాడ్ మండలంలోని పాలెం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో సందడి చేశారు.



ప్రభుత్వం అందజేసిన సమరూప దుస్తులు (యూనిఫాం), షూస్, బెల్టులు ధరించి విద్యార్థులందరూ ఒకే తీరుగా పాఠశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, నరసింహస్వామి, జయశ్రీ, నచ్చయ్య, త్రివేణిలు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే విద్యానంవత్సరం పొడుగునా ప్రతిరోజూ ఇలాగే క్రమశిక్షణతో పాఠశాలకు రావాలని వారు సూచించారు. కాగా, కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా ప్రభుత్వం తమ పిల్లలకు నాణ్యమైన దుస్తులు, బూట్లను ఉచితంగా అందజేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# నిజామాబాద్‌లో టాస్ పరీక్షలు

## : కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలు




నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి )అక్టోబర్ 08:

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్.ఎస్.సి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 7:30 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 163 BNSS (పాత సెక్షన్ 144 సీఆర్పీసీ) అమలులో ఉంటుందని ఆయన వెల్లడించారు.

కమిషనరేట్ పరిధిలోని ఆదర్శ హిందీ విద్యాలయం హైస్కూల్ హిందీ మీడియం (ఎస్.ఎస్.సి కేంద్రం), ఆదర్శ హిందీ విద్యాలయం హైస్కూల్ ఇంగ్లిష్ మీడియం (ఇంటర్మీడియట్ కేంద్రం) లలో ఈ పరీక్షలు జరగనున్నాయి. ప్రతిరోజు ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు.

ఆంక్షలు ఇవే..

పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడాన్ని పూర్తిగా నిషేధించారు.

పరీక్షలు జరిగే సమయాల్లో కేంద్రాల సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలను తప్పనిసరిగా మూసివేయాలని యజమానులకు ఆదేశాలు జారీ చేశారు.

పరీక్షల నిర్వహణ కోసం ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని సీపీ హెచ్చరించారు. పరీక్షలు రాసే విద్యార్థులందరూ ఎలాంటి ఆందోళన లేకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజయం సాధించాలని కోరుతూ ఆయన విద్యార్థులకు శుభాకాంక్షలు (ఆల్ ది బెస్ట్) తెలిపారు.

# పోలీస్ శాఖలో 'ఏఐ' వినియోగం పెంచాలి

## - ఐటీ నిపుణులు, విద్యాసంస్థలతో అదనపు డీసీపీ సమీక్ష

## -నేరాల నియంత్రణ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి




నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 08:

పోలీస్ శాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతం చేయాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా పోలీసింగ్‌ను మరింత వేగవంతం, పారదర్శకం చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ పిలుపునిచ్చారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఐ.పి.యస్. ఆదేశాల మేరకు గురు వారం కమిషనరేట్ కార్యాలయంలో విద్యానంస్థల ప్రతినిధులు, సాంకేతిక నిపుణులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.


ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీస్ శాఖ కూడా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చు కోవాల్సిన అవసరం ఉందన్నారు. నేరాల విశ్లేషణ, నివారణ, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, సీసీటీవీ ఫుటేజీల పరిశీలన, సైబర్ నేరాల దర్యాప్తు, సోషల్ మీడియా మానిటరింగ్‌తో పాటు ట్రాఫిక్ నిర్వహణలో ఏఐ సాంకేతికతను ఏ విధంగా అనుసంధానం చేయవచ్చనే అంశాలపై విస్తృతంగా చర్చించారు. కళాశాలల్లో అందుబాటులో ఉన్న సాంకేతిక నిపుణుల సహకారంతో పోలీస్ శాఖకు ఉపయోగపడే సరికొత్త ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌లు, అప్లికేషన్లను అభివృద్ధి చేయడానికి విద్యాసంస్థలు ముందుకు రావాలని కోరారు. పోలీస్ సిబ్బందికి అవసరమైన సాంకేతిక శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రజా భద్రతకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఈ సమావేశంలో నవ్య భారతి జాయింట్ సెక్రెటరీ డాక్టర్ శిరీష్, విజయ రూరల్ ఇంజనీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. స్వప్న, ఫ్యాకల్టీ సభ్యులు సుజాత, నవ్య, లక్ష్మి, కాకతీయ కాలేజీ కిడ్స్ అధికారులు డి. వేణుగోపాల్, పి. నాగార్జున, క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, సీఓడీ ఎం. లక్ష్మణ్ మరియు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దుదిగాంలో భారీ చోరీ!

## - ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనం

## - 3 తులాల బంగారం, అర కిలో వెండి, రూ.లక్ష నగదు అపహరణ




నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 08: మెండోరా మండల పరిధిలోని దుదిగాం గ్రామంలో బుధవారం రాత్రి ఘోర చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఓ ఇంటి తాళాలు పగులగొట్టి భారీగా నగదు, ఆభరణాలను దోచుకెళ్లారు.

పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ బుధవారం రాత్రి ఇంట్లో లేని సమయాన్ని ఆసరాగా చేసుకున్న దొంగలు, ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలో దాచి ఉంచిన సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి వస్తువులతో పాటు రూ. లక్ష నగదును అపహరించుకుపోయారు.

గురువారం ఉదయం గమనించిన బాధితుడు చంద్రశేఖర్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు మెండోరా ఎస్సై సుహాసిని తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీమ్ ఆధారాలతో దర్యాప్తును ముమ్మరం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామంలో జరిగిన ఈ ఊహించని దొంగతనంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

# గూడూరులో ఘనంగా పోషణ్ మాసోత్సవం

## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం

## : సర్పంచ్ అలివేలు మంగ శ్రీనివాస్



బీబీనగర్, అక్టోబర్ 08 (ప్రజాకలం): మండలంలోని గూడూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలు, చిన్నారులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీసీపీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. పోషకాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, సమతుల ఆహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాన సత్యనారాయణ, వార్డు సభ్యుడు దొనకొండ శ్రీరాములు, పల్లెవెలుగు వైద్యురాలు డాక్టర్ మనీషా, అంగన్‌వాడీ టీచర్లు లోకదాసు రాధిక, ముష్కే శ్యామల, రాజేశ్వరి, మహిళా సంఘాల ప్రతినిధులు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# మహదేవ్‌పూర్‌కు 'టీబీ రహిత' గౌరవం

## కలెక్టరేట్‌లో సర్పంచ్ అనిత ప్రభాకర్‌కు పురస్కార ప్రదానం



బీబీనగర్, అక్టోబర్ 08 (ప్రజాకలం) మండలంలోని మహదేవ్‌పూర్ గ్రామం టీబీ రహిత గ్రామంగా నిలిచిన సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండెం అనిత ప్రభాకర్‌కు ప్రశంసాపత్రం, బహుమతి అందజేశారు. మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, జిల్లా వైద్య పురస్కారం చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దండెం అనిత ప్రభాకర్ మాట్లాడుతూ.. మహదేవ్‌పూర్ గ్రామం టీబీ రహిత గ్రామంగా గుర్తింపు పొందడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ ప్రజల సహకారం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది కృషితోనే ఈ గుర్తింపు దక్కిందని తెలిపారు.గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం అవసరమైన అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిషోర్‌రెడ్డి, ఉపసర్పంచ్ భవాని కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక నేత కృష్ణరావు తోరాత్ బర్త్ డేకు తెలుగు కార్మికుల శుభాకాంక్షలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 08:

ముంబైలోని ప్రఖ్యాత అదానీ విద్యుత్తు కంపెనీలోని కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడే "జైహింద్ విద్యుత్ కాంగార్ సంఘ్ (రిజిస్టర్డ్)" సంస్థాపక



అధ్యక్షులు కృష్ణరావు తోరాత్ గారి 71వ. జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం సాయంత్రం ముంబైలోని విలేపార్లే లోగల కార్మిక సంఘ్ కార్యాలయంలో తోరాత్ బర్త్ డేకు అదానీ విద్యుత్తు కంపెనీకి చెందిన తెలుగు కార్మిక డైనమిక్ నేత, సంఘ్ ఉప ప్రధాన కార్యదర్శి సిరిపంగి రవీందర్ చేతుల మీదుగా ఆయనకు ఎర్ర కండువా కప్పి ఘనంగా సన్మానించారు. వీరికి తోడుగా మజ్దూర్ మజ్దూర్ భాయి భాయి మజ్దూర్ సంఘటన నాయకులైన రమేశ్ చౌవల్, నారపాక లక్ష్మణ్ ప్రతినిధులు కూడా ఆయనకు శాల్వ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సిరిపంగి రవీందర్ మాట్లాడుతూ తమ అదానీ కంపెనీలో తోరాత్ గారు అనేక మంది కార్మికులను పర్మనెంట్ చేశారని, ఆయన కార్మిక వర్గం కోసం నలభై ఏళ్ల పాటు నిర్విరామంగా కృషి చేశారని కొనియాడారు. ఈశుభ ఉత్సవంలో సుక్క నర్సింహ, తండా రాజు, కత్తెర రాములు, శ్రీమతి ఏల్వేలు యఖరి, మూలనివాసి మాలజీ తదితరులు వారికి శుభాకాంక్షలు తెల్పారు.

# పాఠశాలకు కళాతోరణం బహుకరణ

నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 08:

మోర్తాడ్ మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సుంకెట్‌కు గ్రామ సర్పంచ్ మాక్లూర్ వనజ నర్సగౌడ్ విరాళంగా అందించిన




కళాతోరణాన్ని ఘనంగా ప్రారంభించారు. సర్పంచ్ తన మామగారైన దివంగత భూమ నర్సగౌడ్, పెద్ద మామ హన్మగౌడ్ జ్ఞాపకార్థం సుమారు రూ. 50,000/- వ్యయంతో ఈ తోరణాన్ని పాఠశాలకు బహుకరించారు. ఈ కళాతోరణాన్ని మోర్తాడ్ మండల విద్యాధికారి డి. సమ్మిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పాఠశాల రూపురేఖలను మార్చేలా అందమైన తోరణాన్ని బహుకరించిన సర్పంచ్ కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది సంతోష్ కుమార్, గ్రామ విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొని సర్పంచ్ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కిడ్స్ కింగ్‌డమ్ గ్రామర్ హైస్కూల్‌కు 'డైనమిక్ స్కూల్' అవార్డు

## విద్యా రంగంలో విశిష్ట సేవలకు గుర్తింపు..

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల హర్షం

బీబీనగర్, అక్టోబర్ 08 (ప్రజాకలం) విద్యార్థులకు నాణ్యమైన, అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ విద్యా రంగంలో సేవలందిస్తున్న బీబీనగర్ లోని కిడ్స్ కింగ్‌డమ్ గ్రామర్ హైస్కూల్‌కు ప్రతిష్ఠాత్మక 'డైనమిక్ స్కూల్' అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో బుధ వారం ఎడ్యుకేషనల్ న్యూస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ ఇండియా ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాఠశాల కరస్పాండెంట్ కె.వి. మధుసూదన్‌రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కె.వి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత 34 ఏళ్లుగా పాఠశాలను అంకితభావంతో నిర్వహిస్తున్నామని, ఈ అవార్డు తనకు, ఉపాధ్యాయ బృందానికి ఎంతో గర్వకారణమన్నారు. ఈ గుర్తింపుతో తమపై మరింత బాధ్యత పెరిగిందని, భవిష్యత్తులోనూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు సమాజంలో ఉన్నత విలువలు కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. అవార్డు రావడం పట్ల డైరెక్టర్ జి. నాగలక్ష్మి, ప్రిన్సిపాల్ బీ.ఎస్.ఎన్ రాజు, హెడ్‌మాస్టర్ ఎం. భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



# స్మార్ట్ కార్డులు పంపిణీ

భూదాన్ పోచంపల్లి అక్టోబర్ 8 ( ప్రజా కలం )

ప్రతి పేదవారికి సన్న బియ్యం అందేలా కృషిచేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరపారల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ప్రత్యేక అభినందనలు పోచంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ



అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోచంపల్లి మండలంలో ప్రతి ఒక్కరికి సన్నబియ్యం అందేలా భువనగిరి నియోజకవర్గం శాసనసభ సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆయన ఫలితంతో ప్రతి ఒక్కరికి అందుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే సారథ్యంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం మండలంలోని శివారెడ్డిగూడెం, ఇంద్రియాల, కప్రాయపల్లి గ్రామాలలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, జూలూరు పిఎసిఎస్ చైర్మన్ కళ్లెం రాఘవరెడ్డి, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో పిఎసిఎస్ వైస్ చైర్మన్ మక్తాల రమేష్ గౌడ్,జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, సర్పంచులు బొక్క మల్లారెడ్డి, దిరావత్ వెంకటేష్ నాయక్, రాగిర్ నర్మదా సత్యనారాయణ, ఉప సర్పంచులు చిలకల సంతోష్ యాదవ్, మార్గం వెంకటేష్, రేవల్లి అశోక్, ఆర్ ఐ సుధాకర్ రావు, సత్యనారాయణ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు వారాల రామచంద్ర రెడ్డి, పాయిరాల లింగమ్మ,మాజీ ఉపసర్పంచ్ పడాల సతీష్ చారి, ఉడతల సాయిరాం యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు పానుగంటి లింగస్వామి, మేకల రామకృష్ణారెడ్డి, బద్దం రాజేశ్వర్ గౌడ్,మక్తాల గోవర్ధన్ గౌడ్,పాల్గొన్నారు.

# త్రిశక్తి ఆలయానికి 55 కిలోల గంట అందజేత

వలిగొండ అక్టోబర్ 8 ప్రజాకలం:వలిగొండ మండల పరిధిలోని ఆరూర్ గ్రామానికి చెందిన మత్యాద్రి ఆలయ మాజీ డైరెక్టర్ కసిరబోయిన లింగయ్య యాదవ్ స్థానిక త్రీశక్తి ఆలయంలో గురువారం నిత్య నైవేద్య సమర్పణ సమయంలో వినియోగించేందుకు అమ్మవారికి 55 కిలోల గంటను లింగయ్య అరుణ దంపతులు



సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి సేవలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ ఇటువంటి ప్రాచీన ఆగమన సాంప్రదాయాలను కాపాడడం వల్ల దేవాలయాలు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటాయని అభిప్రాయపడ్డారు. అమ్మవారి అనుగ్రహంతో నిత్యం ఈ గంట నాదాన్ని నైవేద్య సమయంలో విన్న భక్తులకు సర్వ మంగళాలు కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చక బృందం మరియు నిర్వాహకుడు చిరంజీవి మణినందన్,కుమారి రిషిక పాల్గొన్నారు.

# జగద్గిరిగుట్టలో భూకబ్జా ఆరోపణలపై కేసు

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 348/1లోని మహా ఆది జాంబవ దేవాలయం ప్రాంగణంలో భూకబ్జాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై పలువురిపై కేసు నమోదైంది. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీమ్ ఫిర్యాదు మేరకు పాల్వాయి గోపి తో పాటు ఎర్ర సైదులు, బండెల ప్రసాద్, తిరుపతి, నరాల వీరస్వామిపై కేసు నమోదు చేసినట్లు జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్న మండల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో కబ్జాలు చేస్తే ల్యాండ్ గ్రాబింగ్ కేసు నమోదు చేసి చేతులు దులుపుకుంటే సరికాదని, అక్రమ నిర్మాణం పూర్తిగా కూల్చివేయాలని మహా ఆది జాంబవ దేవాలయం కమిటీ అధ్యక్షుడు ఎర్ర యాకన్న కోరారు. కబ్జాలు జరుగుతుంటే రెవెన్యూ అధికారులు ఏం చేసిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు.



# అప్పుడు కాలినడకన వెళ్లి ఓటు నమోదు చేసేవారు అధికారులు

## నేడు కంప్యూటర్ ముందర కూర్చొని ఓట్లు తొలగిస్తున్నారు

## ఇదేనా ప్రజాస్వామ్య పద్ధతి:నరసింహులు

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) అప్పుడు (1952) కాలినడకన వెళ్లి ఓటు నమోదు చేసేవారు అధికారులు, నేడు కంప్యూటర్ ముందర కూర్చొని అధికారులు ఓట్లు తొలగిస్తున్నారు ఇదేనా ప్రజాస్వామ్య పద్ధతి అని (తెలంగాణ జన సమితి) కార్మిక విభాగం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు ఆరోపించారు. గురువారం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... ఎనకటికీ ఎడ్ల బండి మీద వెళ్ళి ఓటు నమోదు చేయించే వారు, ఈనాడు కంప్యూటర్లో ఓటు తొలగిస్తున్నారు. మొట్ట మొదటి సారి 1952 సంవత్సరంలో ఓటు నమోదు చేయడాని ఆనాటి ఎలక్సన్



చైర్మన్ సుకుమార్ సేన్ ఒంటెలు, ఎడ్ల బండ్ల లో కాలి నడక నడుచుకుంటూ వెళ్ళి నలుగురూన్న వూరికైనా పంపించి ఓటు నమోదు చేపంచే వారని గుర్తు చేశారు. భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన ఓటు హక్కును అందరికీ సమానంగా ఉండాలి అంతే కానీ అధికార పార్టీకి అవసరమైనట్లు ఓట్లు తొలగించడం సిగ్గుచేటు అన్నారు. బ్రతికిన మనిషి నుండి శరీరాన్ని వేరు చేసినట్లే ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కనీన హక్కుగా లేని పరిస్థితి దాపురించిందని విమర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని కోరారు. కార్మికులు రికార్డితే డొక్కానిందని పరిస్థితిలో ఓట్లను తొలగించడం ఎంతవరకు సభమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కార్మిక విభాగం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బొమ్మలరామారం మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

## కార్యక్రమంలో పాల్గొన్న మండల తాహసిల్దార్

## స్మార్ట్ రేషన్ కార్డు వలన అనేక ప్రయోజనాలు



బొమ్మలరామారం,అక్టోబర్ 08(ప్రజా కలం)

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల రేషన్ సరుకులతో పాటు అనేక ప్రజా ప్రభుత్వ ఉపయోగాలకు గుర్తింపు కార్డుల పని చేస్తుందని బొమ్మలరామారం తహసీల్దార్ పి.రాధ తెలిపారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున బొమ్మలరామారం మండల కేంద్రంలో చౌక ధరల దుకాణం షాప్ నెంబర్ 11 ద్వారా లబ్ధిదారులకు 913 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి తహసిల్దార్ ముఖ్య అతిథిగా హాజరైనారు

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ప్రతి ఒక్క రేషన్ కార్డు లబ్ధిదారులు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు స్మార్ట్ కార్డుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని స్మార్ట్ కార్డును భద్రంగా ఉంచుకోవలసిన అవసరం ఉందని ఆమె తెలిపారు సమాజంలో వస్తున్న డిజిటల్ మార్పులకు అనుగుణంగా ప్రభుత్వం స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తుందని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో బొమ్మలరామారం గ్రామ సర్పంచ్ కట్ట ఉమాదేవి శ్రీకాంత్ గౌడ్, కాజీపేట సర్పంచ్ పల్లెపాటి రాములు, ఎంపీడీవో శ్యామల, ఎస్.ఐ బుగ్గ శ్రీశైలం తో పాటు ఉప సర్పంచ్ ఎలబోయిన జంగయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాంపల్లి మహేష్ గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ ఉట్ల నరసింహ, దేవస్థాన కమిటీ చైర్మన్ రాంపల్లి వెంకటేష్ గౌడ్, కాజీపేట ఉప సర్పంచ్ రామిడి శ్రీకాంత్,బొమ్మలరామారం రేషన్ షాప్ డీలర్ బేతాళ సంధ్యారాణి శ్రీనివాసులు, వార్డు సభ్యులు తుడుం గిరి, జూపల్లి సునీత, పర్రె బబీత, గ్రామ పెద్దలు ఎలబోయిన బిక్షపతి, కేసారం శంకరయ్య, కాంగ్రెస్ ముఖ్య నాయకులు మర్రి భగవంత రెడ్డి, మైలారం యాదయ్య, మలేబోయిన రఘు, పండుగ రాజు, జూపల్లి విజయ రాములు, పండుగ రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు

# ప్రజల సమస్యలపై సర్పంచ్‌లు పోరాడాలి


## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలి: వంటేరు ప్రతాప్ రెడ్డి

## సర్పంచ్‌లు ప్రజలకు అండగా నిలవాలి.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

## గ్రామీణ సమస్యల పరిష్కారంలో సర్పంచ్‌లదే కీలక పాత్ర

గజ్వేల్: అక్టోబర్ 8 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సర్పంచ్‌లు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పనిచేయాలని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి సూచించారు. గజ్వేల్ మండలం బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడిగా రంగంపేట గ్రామానికి చెందిన నడిగోప్పుల నాగరాజును, ఉపాధ్యక్షుడిగా ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాసాముల్ల శ్రీనివాస్‌ను సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ నూతనంగా ఎన్నికైన ఫోరమ్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారంలో సర్పంచ్‌ల పాత్ర కీలకమన్నారు.గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గ్రామీణాభివృద్ధి,రైతులు, పేదలు, మహిళల సంక్షేమానికి పలు కార్యక్రమాలు అమలు చేశామని వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుబంధు,రైతుబీమా, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి--షాదీ ముబారక్,కేసీఆర్ కిట్,పల్లె ప్రగతి వంటి కార్యక్రమాలతో పాటు గ్రామాల్లో వైకుంఠధామాలు,చెత్త సేకరణ, డంప్‌యార్డుల ఏర్పాటు వంటి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. వీటి ద్వారా తెలంగాణను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపామని అన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారం,రైతులకు నాణ్యమైన విద్యుత్,సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లో నిరాశ నెలకొందని వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ సర్పంచ్‌ల ఫోరమ్ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.గ్రామీణ ప్రజల గొంతుకగా ఫోరమ్ పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, బీఆర్ఎస్ పార్టీకి మంచి పేరు వచ్చేలా పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అహ్మదీపూర్ బ్యాగారి ప్రభాకర్,కోలుగూరు జ్యోతి స్వామి, గిరిపల్లి పిట్ల లావణ్య రమేష్,మక్త మాసాన్‌పల్లి ఫహీమ్,షేరిఫ్‌పల్లి మమత శ్రీనివాస్‌రెడ్డి,శ్రీగిరిపల్లి కల్పన బాలస్వామి,బూర్గుపల్లి చెలిమేటి వెంకటలక్ష్మి,బంగ్లా వెంకటాపూర్ నాగమణి నర్సింలు,నాయకులు రమేష్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

వలిగొండ అక్టోబర్ 8 ప్రజాకలం:మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదన్న మనస్తాపంతో



ఓ యువకుడు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన, వలిగొండ మండలం ఏదుల్లగూడెం గ్రామంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం బసంతపురం గ్రామానికి చెందిన జంగిటి కర్ణాకర్ (25) ఇంటర్ వరకు చదివి కూలీ పనులు చేసుకుంటూ వలిగొండ మండల పరిధిలోని ఎదుల్ల గూడెం గ్రామంలో జీవనం కొనసాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ మద్యం సేవించేవాడని,రెండు రోజుల క్రితం మద్యం కోసం డబ్బులు అడగగా తండ్రి మందలించడంతో తన సెల్‌ఫోన్‌ను విక్రయించి మద్యం సేవించినట్లు తెలిపారు.అనంతరం కొత్త ఫోన్ కొనుగోలుకు డబ్బులు అడగగా కుటుంబ సభ్యులు ఇవ్వలేమని చెప్పడంతో మనస్తాపానికి గురైనట్లు పేర్కొన్నారు.మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు

# మురుగు నీటి దుర్వాసన రాకుండా తక్షణ చర్యలు చేపట్టండి

## ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 132 – జీడిమెట్ల డివిజన్ జీడిమెట్ల గ్రామ పైప్ లైన్ రోడ్డు లోని “ఎన్ఎస్ఎల్ ఎల్బి గోదావరి”గత కొన్ని రోజులుగా మురుగునీటి దుర్వాసనతో వారు ఎదుర్కొంటున్న సమస్యను ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ దృష్టికి



తీసుకురాగా గురువారం క్షేత్ర స్థాయిలో అధికారులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే మురుగునీటి దుర్వాసన సమస్యను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని, ఎక్కడ మురుగు నీరు నిల్వ ఉండకుండా దిగువ ప్రాంతాలకు మురుగునీరు సాఫీగా సాగిపోయేలా యుద్ధ ప్రాతిపదికన తక్షణ చర్యలు చేపట్టి మురుగు నీటి దుర్వాసన రాకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈకార్యక్రమంలో ఈఈ భద్రు, ప్రాజెక్ట్స్ ఈఈ గోపాల కృష్ణ, జీఎం మాధవిలత, డీఈ దుర్గా ప్రసాద్, మేనేజర్ శివప్రసాద్, ఎన్ఎస్ఎల్ ఎల్బీ గోదావరి ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ రాజేష్ మిశ్రా, ప్రధాన కార్యదర్శి జగన్నాథం, వైస్ ప్రెసిడెంట్ పి.ఎన్. అనురాధ, కోశాధికారి రామేశ్వర్ రావు, కల్చరర్ సెక్రెటరీ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

## లోక్ భవన్ ముట్టడిలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహారెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 07 (ప్రజా కలం):

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ‘ఇండియా’ కూటమి మరియు ఏఐసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన లోక్ భవన్ ముట్టడి కార్యక్రమం హైదరాబాద్ లో ఉద్రిక్తంగా సాగింది.పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్





గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ నిరనన ప్రదర్శనలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చి తమ నిరసన గళాన్ని వినిపించాయి. ఈ నిరనన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని, కేంద్ర ఎన్నికల కమిషన్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఎన్నికల కమిషన్ విఫలమైందని, కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆమె ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి, కోఆర్డినేటర్ సచిన్ సావంత్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసుల అడ్డంకులు, ఆంక్షలను సైతం లెక్కచేయకుండా కాంగ్రెస్ శ్రేణులు లోక్ భవన్ ముట్టడికి యత్నించారు.

## బాలాపూర్‌లో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

### కాంటెస్టెడ్ ఎమ్మెల్యే టీపీసీసీ సెక్రెటరీ అమరేందర్ రెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 07 (ప్రజా కలం ):

కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు అన్ని విధాలా లబ్ధి చేకూరుతోందని కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, టీపీసీసీ సెక్రెటరీ యేల్మటి అమరేందర్ రెడ్డి అన్నారు.బాలాపూర్ పాత గ్రామపంచాయతీ వద్ద మంగళవారం అర్హులైన



లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ... గతంలో ఎన్నడూ లేని విధంగా రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు లేదా 'స్మార్ట్ రేషన్ కార్డు' ద్వారా రేషన్ సరుకులతో పాటు, ఆరోగ్యశ్రీ వైద్య సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి అన్ని సంక్షేమ పథకాలను ఒకే కార్డుతో అనుసంధానం చేయనున్నారని తెలిపారు. ఈ స్మార్ట్ కార్డు వల్ల లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత వంగేటి ప్రభాకర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ క్యారంగారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

### -సీపీఐ నేత పల్నాటి యాదయ్య డిమాండ్

మహేశ్వరం, అక్టోబర్ 07 (ప్రజా కలం):

భారత ఎన్నికల ప్రధాన అధికారి (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ తక్షణమే




తన పదవికి రాజీనామా చేయాలని సీపీఐ సీనియర్ నేత, నాగారం గ్రామ మాజీ ఉప సర్పంచ్ పల్నాటి యాదయ్య డిమాండ్ చేశారు.ఓటర్ జాబితా సవరణ పేరుతో ఎన్నికల సంఘం తన విశ్వసనీయతను నీరుగారుస్తోందని ఆయన మండిపడ్డారు.గురువారం ఇండియా కూటమి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో "చలో లోక్ భవన్" పేరిట చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర స్థాయి ప్రముఖ నేతలతో కలిసి పల్నాటి యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడుకునే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించడం వెనుక ఉన్న కుట్రపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి జ్ఞానేష్ కుమార్ అన్యాయంగా అర్హులైన వారి ఓటు హక్కును రద్దు చేస్తున్నారని ఆరోపించారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న మహంకాళి ఆలయం

### శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి: బాలశర్మ

### దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి..


### భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు

గజ్వేల్: అక్టోబర్ 8 (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని పురాతన శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,వైభవంగా నిర్వహించేందుకు



ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. శరన్నవరాత్రి వేడుకల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటోంది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బాలశర్మ మాట్లాడుతూ అమ్మవారి దయ ఉంటే అన్నీ మంచే జరుగుతాయని అన్నారు.దాతల సహకారంతో పురాతన మహంకాళి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.ఆలయ అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని బాలశర్మ తెలిపారు. ఆలయ అభివృద్ధికి విరాళాలు అందించదలచిన దాతలు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు.శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని,అమ్మవారి ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పురోహితులు సాయి పంతులు, 1వ వార్డు కౌన్సిలర్ కప్ప మమత పోచయ్య,ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్,కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా... రెండవ రోజు సంగారెడ్డిలో దీక్ష కొనసాగించిన జగ్గారెడ్డి, నిర్మల


-కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా బుధవారం దీక్ష చేపట్టిన జగ్గారెడ్డి దంపతులు.

-రాహుల్ కు మద్దతుగా రాత్రింబవళ్లు దీక్ష వేదికపైనే నిరసన తెలిపిన జగ్గారెడ్డి, నిర్మల.

- తమ అగ్రనేత ఉద్యమం చేసినన్నాళ్లు తమ పోరాటం కూడా కొనసాగుతుందని వెల్లడి

- జగ్గారెడ్డి దంపతుల దీక్షకు మద్దతుగా తరలివచ్చిన ప్రజా సంఘాలు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, సంగారెడ్డి ప్రజలు

- సంఘీభావం తెలిపిన పాడెం వీరయ్య, ధర్మపురి సంజయ్, సంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి




సంగారెడ్డి ప్రతినిధి
అక్టోబర్ 08( ప్రజా కలం):

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి చేపట్టిన దీక్ష రెండో రోజూ కొనసాగింది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు రైతులు, వివిధ సంఘాల నాయకులు దీక్షా శిబిరానికి తరలివచ్చి సంఘీభావం తెలిపారు. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి జగ్గారెడ్డి దంపతులకు మద్దతు పలికారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశ ప్రజలందరూ రాహుల్ గాంధీకి అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. సంగారెడ్డి నియోజకవర్గంలో రానున్న రోజుల్లోనూ సంఘీభావ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, జగ్గారెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నుంచి సేంద్రియ సాగు వైపు..

### నరేష్‌రెడ్డి దంపతులకు కలెక్టర్ అభినందనలు

- సేంద్రియ సాగును ప్రోత్సహించాలి: కలెక్టర్ హైమావతి

- క్షీరసాగర్‌లో సేంద్రియ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్

- సేంద్రియ సాగులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైన నరేష్‌రెడ్డి దంపతుల ఆసక్తికి ప్రశంస





సేంద్రియ సాగులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైన నరేష్‌రెడ్డి దంపతుల ఆసక్తికి ప్రశంస

సిద్దిపేట: అక్టోబర్ 8 (ప్రజా కలం ప్రతినిధి):

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు రైతులు ప్రకృతి ఆధారిత సాగు పద్ధతులను అవలంబించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు.గురువారం ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలో రైతు నరేష్‌రెడ్డి రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో పూర్తిగా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించారు.

ఈ సందర్భంగా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్న వివిధ రకాల వరి,పండ్ల, కూరగాయల పంటలను, ప్రకృతి ఆధారిత ఎరువుల వినియోగాన్ని కలెక్టర్ పరిశీలిం చారు.గ్రామస్తులతో మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా భూసారాన్ని పరిరక్షించడంతో పాటు నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేసే అవకాశం ఉందని తెలిపారు.క్షీరసాగర్‌కు చెందిన నరేష్‌రెడ్డి దంపతులు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నప్పటికీ, వ్యవసాయంపై ఉన్న ఆసక్తితో రెండున్నర ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారని గ్రామస్తులు కలెక్టర్‌కు వివరించారు.ప్రతి వారం సెలవు రోజుల్లో కుటుంబంతో కలిసి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి సాగు పనులను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సేంద్రియ వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించేందుకు రైతులకు అవసరమైన సాంకేతిక సహకారంతో పాటు సబ్సిడీపై విత్తనాలు,ఎరువులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మరింతగా దృష్టి సారించాలని సూచించారు.అనంతరం రైతు నరేష్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన కలెక్టర్ ఆసక్తితో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నందుకు అభినందించారు. సేంద్రియ సాగు చేయాలనుకునే వారికి నరేష్‌రెడ్డి దంపతులు ఆదర్శంగా నిలుస్తారని ప్రశంసించారు.కలెక్టర్ వెంట తహసీల్దార్, స్థానిక సర్పంచ్ బాలరెడ్డి, ప్రజాప్రతినిధులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.




## గజ్వేల్‌లో కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు

- రాహుల్‌గాంధీ ఆందోళనతో బీజేపీలో వణుకు పుట్టింది: అంక్షారెడ్డి

- ఓటు చోరీకి వ్యతిరేకంగా క్యాండిల్ ర్యాలీ..

- మోదీ,సీఈసీ,బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు

గజ్వేల్: అక్టోబర్ 8 (ప్రజా కలం ప్రతినిధి):

ఢిల్లీలో ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేపట్టిన ఆందోళనలో పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం గజ్వేల్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలు తూంకుంట




అంక్షారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా అంక్షారెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దేశంలో అక్రమ పద్ధతుల్లో తిరిగి అధికారం చేపట్టేందుకే ఎన్నికల కమిషన్‌ను కేంద్ర ప్రభుత్వం కీలుబొమ్మలా ఉపయోగించుకుంటోందని విమర్శించారు. ఇది ఎంతమాత్రం సాగబోదని హెచ్చరించారు.ఢిల్లీలో ఇండియా కూటమి ఎంపీలు చేపట్టిన ఆందోళనను అడ్డుకోవడం సిగ్గుచేటని అంక్షారెడ్డి అన్నారు.ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అవహాన్యం చేస్తూ దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీల పోరాటంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో వణుకు మొదలైందని వ్యాఖ్యానించారు.ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దించే వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సుఖేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి,కౌన్సిలర్లు విష్ణువర్ధన్‌రెడ్డి,రమేష్,గుంటుకు శేను, మాజీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ సమీర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ వహీద్,కాంగ్రెస్ నాయకులు జహీర్,అంజి యాదవ్,గుంటుకు శ్రీనివాస్,సారిక శ్రీనివాస్‌రెడ్డి,చెప్యాల శేఖర్,జహంగీర్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరి, పత్తి పంటల పరిశీలన.

### పొట్ట దశకు ముందు వరికి

### యూరియా, పొటాష్ వేయాలి.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 08.

రాయపోల్ మండల పరిధిలోని చిన్నమాసనపల్లి, ముంగిసపల్లి గ్రామాల్లో వరి, పత్తి పంటలను మండల వ్యవసాయ అధికారి ఆర్.నరేష్ గురువారం



పరిశీలించారు. ప్రస్తుతం వరి పంటలు పొట్ట దశకు ముందు, కొన్ని పొట్ట దశలో ఉన్నాయని తెలిపారు. పొట్ట దశకు ముందు చివరిసారిగా యూరియా, పొటాష్ కలిపి వేయాలని రైతులకు సూచించారు. పొటాష్ వినియోగంతో గింజ నిండుగా ఏర్పడి, తాలు తగ్గడంతోపాటు గింజ బరువు పెరుగుతుందని పేర్కొన్నారు. యూరియా, పొటాష్ వేసిన రెండు, మూడు రోజుల తర్వాత కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్పీ 400 గ్రాములు ఎకరాకు, వేపనూనె 500 నుంచి 1,000 మిల్లీలీటర్లు ఎకరాకు కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. దీంతో తెల్లకంకి, కాండం తొలుచు పురుగులను నివారించవచ్చన్నారు. ప్రస్తుతం పత్తి పంటల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోతున్న చోట 13:0:45 ఒక కిలో ఎకరాకు లేదా నానో యూరియా 2--3 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే బెట్ట పరిస్థితులను కొంతవరకు తట్టుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నమాసనపల్లి సర్పంచ్ నర్సింహారెడ్డి, రైతులు ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

## ఇక పాదయాత్రల సీజన్



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాలు రానున్న కాలంలో పూర్తిగా వీధులు, పల్లె బాట పట్టనున్నాయి. 2028 సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్ కానున్న 2027 సంవత్సరం రాష్ట్రంలో అక్షరాలా పాదయాత్ర నామ సంవత్సరం గా మారబోతోంది. తెలుగు నాట అధికారం దక్కించుకోవడానికి లేదా నిలబెట్టుకోవడానికి కాలినడకనే అత్యంత శక్తివంతమైన రాజకీయ అస్త్రంగా గట్టిగా నమ్ముతున్నారు. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, స్వతంత్ర గళాలు సైతం బూట్ల లేసులు కట్టుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. ఎవరి వ్యూహాలు వారికున్నప్పటికీ, 2027లో రాష్ట్రంలోని ప్రధాన రహదారులన్నీ రాజకీయ నేతల పాదయాత్రలతో కిక్కిరిసిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.ప్రధానంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 2027లో చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త పాదయాత్రపై ఇప్పటికే ఆ పార్టీ శ్రేణుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అధికారం కోల్పోయిన తర్వాత ప్రజల్లో పట్టు పెంచుకునేందుకు, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఈ పాదయాత్రనే గేమ్ ఛేంజర్ గా ఆయన భావిస్తున్నారు. మరోవైపు, తెలంగాణ రక్షణ సేన పెట్టి సీఎం అయిపోతానని శపథం చేస్తున్న కల్వకుంట్ల కవిత సైతం మహిళా లోకం, సింగరేణి సహా క్షేత్రస్థాయి కార్మిక వర్గాలతో మమేకమయ్యేలా సమాంతర పాదయాత్ర ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు.ప్రతిపక్షాలకు ఆ ఒక్క స్పేస్ కూడా వదిలిపెట్టకూడదని అధికార కాంగ్రెస్ శిబిరం కూడా భారీ సన్నాహాలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీల క్షేత్రస్థాయి ఫలితాలను ప్రజలకు వివరిస్తూ ప్రతిష్టాత్మక పాదయాత్రకు రంగం సిద్ధం చేసుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. సీఎంకు తోడుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ వేర్వేరు ప్రాంతాలను ఎంచుకుని పాదయాత్రల ద్వారా ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. గతంలో భట్టి చేసిన పీపుల్స్ మార్చ్ కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో కీలక పాత్ర పోషించగా, ఈసారి అధికారాన్ని నిలబెట్టుకునే రక్షణ కవచం గా కాంగ్రెస్ త్రయం పాదయాత్రలను మలచుకోనుంది.ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుతో పాటు ఇతర కాషాయ నేతలు కూడా ప్రజా సమస్యలపై పాదయాత్రలతో ప్రజల్లోకి వెళ్లేందుకు సన్నాహాలు చేస్తుండగా, ఇప్పటికే పలు అంశాలపై క్షేత్రస్థాయిలో ఉన్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తనదైన శైలిలో ప్రజా గొంతుకగా పాదయాత్రను కొనసాగించే యోచనలో ఉన్నారు.

# బాచుపల్లిలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 40వ స్టోర్ ప్రారంభం





హైదరాబాద్,
అక్టోబర్ 8 (ప్రజా కలం ప్రతినిధి)

సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ తమ విస్తరణలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. హైదరాబాద్‌లోని బాచుపల్లి–మియాపూర్ రోడ్డులో అమీన్‌పూర్ వద్ద సంస్థకు చెందిన 40వ స్టోర్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించింది. ప్రముఖ నటి వైష్ణవి చైతన్య జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేయడం ద్వారా నూతన స్టోర్‌ను ప్రారంభించారు. దసరా, దీపావళి పర్వదినాలను పురస్కరించుకుని ఈ నూతన స్టోర్‌లో అన్ని తరాల కుటుంబ సభ్యుల అభిరుచులకు అనుగుణంగా సంప్రదాయ చీరలు, పండుగ దుస్తులు, ఆధునిక డిజైన్లు, ఫ్యాషన్ కలెక్షన్లను ఒకే చోట అందుబాటులో ఉంచారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో షాపింగ్ ప్రియులు, అభిమానులు హాజరై సంస్థకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నటి వైష్ణవి చైతన్య మాట్లాడుతూ బాచుపల్లిలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 40వ స్టోర్‌ను తన చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా కుటుంబంలోని అన్ని తరాల వారి అభిరుచులకు అనుగుణంగా విభిన్న రకాల వస్త్రాలు ఒకే చోట లభించడం విశేషమన్నారు.

పండుగల సందర్భంగా కుటుంబ సమేతంగా షాపింగ్ చేసుకునేందుకు ఈ స్టోర్ ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ చైర్‌పర్సన్, హోల్‌టైమ్ డైరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విశ్వనగరంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లోని బాచుపల్లి ప్రాంతంలో 40వ స్టోర్‌ను ప్రారంభించడం తమకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో కుటుంబాలు, షాపింగ్‌ప్రియులు ఉన్నందున వారి వండుగలు, వివాహాలు, శుభకార్యాల అవసరాలకు అనుగుణమైన వస్త్రాలను అందించడం సంతోషంగా ఉందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ శ్రీణ రాజమౌళి మాట్లాడుతూ దసరా, దీపావళి పండుగలతో పాటు వివాహ వేడుకలను దృష్టిలో ఉంచుకుని కుటుంబంలోని ప్రతి ఒక్కరి అభిరుచులకు సరిపోయే వస్త్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

వినియోగదారులకు ఆహ్లాదకరమైన, సౌకర్యవంతమైన షాపింగ్ అనుభూతిని కల్పించడమే తమ లక్ష్యమన్నారు. హోల్‌టైమ్ డైరెక్టర్ తిరువీధుల ప్రసాదరావు మాట్లాడుతూ సంప్రదాయాన్ని ప్రతిబింబించే పట్టుచీరల నుంచి పండుగ చీరలు, క్యాజువల్ వేర్ వరకు కుటుంబంలోని అన్ని తరాల వారిని ఆకట్టుకునే విభిన్న రకాల కలెక్షన్లు నూతన స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అన్ని వర్గాల వారికి ప్రత్యేక కలెక్షన్లు దసరా, దీపావళి, వివాహాది శుభకార్యాలను దృష్టిలో ఉంచుకుని 40వ స్టోర్‌లో ప్రత్యేక కలెక్షన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. మహిళల కోసం: కంచి పట్టుచీరలు, ఫ్యాన్సీ చీరలు, దేశవ్యాప్తంగా మాస్టర్ వీవర్స్ రూపొందించిన ప్రత్యేక కళాత్మక వస్త్రాలు, వధువుల కోసం సంప్రదాయ డిజైన్లతో కూడిన ప్రత్యేక కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పురుషుల కోసం: డిజైనర్ కుర్తాలు, సంప్రదాయ ఎత్నిక్ వేర్, ఫార్మల్ సూట్స్, ఆధునిక క్యాజువల్ దుస్తులను అందిస్తున్నారు. చిన్నారుల కోసం: ఆకర్షణీయమైన రంగులు, ఆధునిక డిజైన్లతో కూడిన ట్రెండీ ఫెస్టివల్ దుస్తులు అందుబాటులో ఉంచారు. దసరా, దీపావళి పర్వదినాలు, వివాహాల సీజన్ నేపథ్యంలో కుటుంబ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కలెక్షన్లను సిద్ధం చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. బాచుపల్లి, మియాపూర్, అమీన్‌పూర్‌తో పాటు పరిసర ప్రాంతాల షాపింగ్‌ప్రియులు నూతనంగా ప్రారంభమైన సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 40వ స్టోర్‌ను సందర్శించి పండుగ షాపింగ్ అనుభూతిని పొందాలని యాజమాన్యం కోరింది. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని అందిస్తున్న ప్రత్యేక ఆఫర్లను వినియోగించుకోవాలని సూచించింది.

# బడంగ్ పేట సర్కిల్ లో

# బీజేపీ పరిస్థితి అయోమయం

- బీజేపీ పార్టీ నాయకుడు లేక కార్యకర్తలు అయోమయంలో!
- డివిజన్ అధ్యక్షుల నియామకం ఏదీ?
- జిల్లా నాయకత్వం తీరుపై తీవ్ర అసంతృప్తి

"ప్రతి చిన్న కార్యక్రమానికి అందెల శ్రీరాములు యాదవ్ వేనా...?"
ప్రతి చిన్న విషయానికి, ప్రతి




మహేశ్వరం,అక్టోబర్ 8
(ప్రజా కలం ప్రతినిధి)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని నాదర్గుల్, ప్రశాంతి హిల్స్, జిల్లల్ గూడ,మీర్పేట,బడంగ్ పేట,బాలాపూర్ డివిజన్ లలో భారతీయ జనతా పార్టీ పరిస్థితి దయనీయంగా మారింది. పార్టీకి రథసారథులు లేకుండా పోయారు. నాయకత్వం లేక కార్యకర్తలు తీవ్ర నిరుత్సాహంలో కూరుకుపోయారు. నెలలు గడుస్తున్నా డివిజన్ అధ్యక్షులను నియమించకపోవడం పట్ల పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**ఏం జరుగుతోంది బీజేపీలో?**

బీజేపీ పార్టీలో ఏం జరుగుతుందో కనీసం కార్యకర్తలకు కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది. బూత్ స్థాయి కమిటీలు, డివిజన్ కమిటీలు లేక పార్టీ కార్యక్రమాలు నామమాత్రంగా జరుగుతున్నాయి గతంలో కార్పొరేషన్ ఎన్నికలు జరిగినప్పుడు అన్ని పార్టీలకు దీటుగా పోటాపోటీగా బిజెపి కార్పొరేటర్ ను గెలిపించుకున్నారు. ఆ తర్వాత శాసనసభ ఎన్నికల్లో అధికారు టిఆర్ఎస్ పార్టీకి చెందిన జిల్లా మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఓడించే పరిస్థితికి తీసుకువచ్చి రెండో స్థానంలో అందెల శ్రీరాములు యాదవ్ నిలిచారు. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీని వెనుకకు నేటి ఏకంగా పార్లమెంటు సీటును కైవసం చేసుకుంది.ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పూర్తిగా విఫలమైంది. జిల్లా నాయకత్వం మౌనం వహించడం వెనుక ఆంతర్యం ఏమిటనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

డివిజన్లలో సమర్థులైన నాయకులు ఉన్నా వారికి అవకాశం ఇవ్వకపోవడం, కేవలం ఒకరిద్దరి చేతిలోనే పార్టీని పెట్టడం వల్ల పార్టీ బలహీనపడుతోందని సీనియర్ కార్యకర్తలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. సమస్యకు అందెల శ్రీరాములు యాదవ్ అన్నిటికీ అందుబాటులో ఉండగలడా? అనే ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. ఒక వ్యక్తి గుత్తాధిపత్యం వల్ల పార్టీలో అంతర్గత కుమ్ములాటలు పెరిగి, కార్యకర్తలు పార్టీకి దూరమవుతున్నారు.ప్రజా సమస్యలపై పోరాడాల్సిన బీజేపీ, నాయకత్వం లేక నిర్వీర్యమైపోయింది.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దూసుకుపోతుంటే, బీజేపీ మాత్రం ఉనికి కోసం వెతుక్కునే పరిస్థితికి వచ్చింది. ఇదే పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో నాదర్గుల్, ప్రశాంతి హిల్స్, జిల్లల్ గూడ,మీర్పేట,బడంగ్ పేట,బాలాపూర్ బీజేపీ పార్టీ పట్టు కోల్పోవడం ఖాయమని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర, జిల్లా నాయకత్వం స్పందించి, డివిజన్ లకు సమర్థులైన, ప్రజల్లో ఉండే నాయకులను నియమించాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

**30 ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న కార్యకర్తల పరిస్థితి ఏంటి?**

**పార్టీ జెండా మోసి, పార్టీని ఊపిరిగా బతికిన కార్యకర్తల నిస్పృహ నిరాశ**

ఏ పార్టీలో లేని విధంగా భారతీయ జనతా పార్టీలోనే పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని, ఇతర పార్టీలకు వెళ్లకుండా 30 ఏళ్లుగా పార్టీ జెండా మోసిన నాయకులు, కార్యకర్తలు ఎంతో మంది ఉన్నారు. పార్టీని ఊపిరిగా బతికిన అలాంటి నిజమైన కార్యకర్తల పరిస్థితి ఇప్పుడు బడంగ్ పేట్ లో అగమ్యగోచరంగా మారింది.ప్రస్తుత బీజేపీ జిల్లా నాయకత్వం తీసుకుంటున్న నిర్ణయాల పట్ల నిజమైన కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీని నమ్ముకుని ఉంటూ... ఇంకో పార్టీకి వెళ్లలేక, ఈ పార్టీలో ఉండలేక, పని చేయలేక సతమతమవుతూ తీవ్ర నిరాశ, నిస్పృహలో కూరుకుపోయారు. ఇకనైనా జిల్లా నాయకత్వం క్షుణ్ణంగా పరిశీలించి, పార్టీని నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరుతున్నారు. బడంగ్ పేట్ లో ఖాళీగా ఉన్న డివిజన్ అధ్యక్షులు, ఇతర పదవులను వెంటనే భర్తీ చేసి, పార్టీ కోసం కష్టపడే వారికి అవకాశం ఇచ్చి పార్టీని బలోపేతం చేయాలని పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు జిల్లా నాయకత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో బడంగ్ పేట్ లో బీజేపీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

---

అక్టోబర్ 9న కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా...

## ఉన్నత ఉద్యోగాన్ని వదలి పేదల కోసం జీవితాన్ని త్యాగం చేసిన బహుజన యోధుడు కాన్షీరామ్


సామాజిక అంతరాల్ని... పీడనలను... దోపిడీని ... మనువాద రాజకీయాలను అంతమొందించడానికి ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాన్ని ....తల్లిదండ్రులను, కుటుంబం... వికాసవంతమైన జీవితాన్ని, పదవులను వదిలిన అభినవ బుద్ధుడు కాన్షీరామ్. మూడున్నరవేల సంవత్సరాల ముందు తల్లిదండ్రులను, భార్యబిడ్డలను, రాజ్యాన్ని సకాల సాకార్యాలను వదిలి దేశ సంచారం చేసిన గౌతమ బుద్ధుని లాగా కాన్షీరామ్ ది కూడా మహోన్నతమైన చరిత్ర. అక్టోబర్ 9 కాన్షీరామ్ వర్ధంతి. సంప్రదాయ రాజకీయాలను మలుపు తిప్పిన ధీరుడు, మనువాద భావజాలాన్ని.... కుటిల రాజకీయాల మెడలు వంచిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనల్ని... ఆశయాలను ఆచరణలో చూపించిన బహుజన నాయకుడు కాన్షీరామ్. పంజాబ్ రాష్ట్రంలోని రోపార్ జిల్లాలో ఖావాజ్ ఫూర్ గ్రామంలో మార్చి 15, 1934లో హరిసింగ్, బిషన్ సింగ్ కౌర్ దంపతులకు జన్మించిన మొదటి మగబిడ్డ కాన్షీరామ్. కాన్షీరామ్ చిన్నతనం నుంచే సంప్రదాయ వ్యతిరేక వైఖరి, సిక్కు సంప్రదాయాల ప్రకారం పెంచాల్సిన జుట్టును కత్తిరించుకున్నారు. తన రోజు వారీ ఖర్చుల కోసం తల్లిదండ్రులపై ఆధారపడకుండా చిన్న చిన్న పనులు చేసి సంపాదించుకున్నాడు. రోపార్ లో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసిన కాన్షీరామ్కు డెహ్రాడూన్ లోని భారతీయ సర్వే విభాగంలో ట్రైనీ అధికారిగా ఉద్యోగం వచ్చింది. అదే సమయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మరణించడం. ఆయన మరణంతో దళిత ఉద్యోగులంతా దుఖసారంలో మునిగిపోవడం చూసి కాన్షీరామ్ అంబేద్కర్ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగింది. అదే విభాగంలోని సహ ఉద్యోగి శ్రీగైనీ ద్వారా బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి లోతైన విషయాలను మొట్టమొదటి సారిగా తెలుసుకున్నారు. అదే సమయంలో రక్షణ పరిశోధనా శాఖలో పోటీ పరీక్షలు రాసి పూనాలోని డిఫెన్సు లేబరేటరీలో సైంటిఫిక్ అధికారిగా చేరాడు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రభుత్వ సెలవు దినాలను ప్రకటిస్తూ క్యాలండర్ ప్రచురిస్తుంది. ఆ సంప్రదాయం ఇప్పుడు కూడా ఉంది. అయితే 1963లో ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాలలో ప్రతి సంవత్సరం ప్రకటించే సెలవు దినాలైన డాక్టర్ అంబేద్కర్ జయతి, బుద్ధ జయంతి రద్దు చేయచేసి క్యాలెండర్ను ప్రచురించారు. ఆ సెలవు దినాలకు బదులుగా బాలగంగాధర్ తిలక్ జయంతి, దీపావళికి అదనంగా ఒక రోజు కలిపి సెలవులు ప్రకటించారు. క్యాలెండర్ విషయంలో అధికారుల వివక్షాపూరిత చర్య పట్ల షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన ఉద్యోగులు, అధికారులు ఎంతో బాధ పడినా అవమాన పడినా ఎవరూ కూడా బయటపడి ఎదురించలేదు. మాట్లాడలేదు, కానీ నాల్గవ తరగతి ఉద్యోగి అయిన 'దీనా బానా' బహిరంగంగా వ్యతిరేకించాడు. దీంతో అధికారులు అతన్ని ఉద్యోగం నుంచి భర్తరఫ్ చేశారు. ఈ సంఘటనను ప్రత్యక్షంగా చూసిన కాన్షీరామ్ దీనాబానా సంఘటనను జీర్ణించుకోలేకపోయాడు.

దీనాబానాకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా నిలిచి పోరాడి తిగిరి అతని ఉద్యోగాన్ని కాపాడి అంబేద్కర్, బుద్ధ జయంతి సెలవులను కూడి తిరిగి సాధించాడు. అదే విధంగా మరో సంఘటన కాన్షీరామ్ను అంబేద్కర్ ఆలోచన విధానం వైపు వెళ్లేలా చేసింది. అన్ని అర్హతలు ఉన్నా ఓ దళిత మహిళను ఉద్యోగంలో చేర్చుకోకుండా వివక్షా పూరితంగా వేధిస్తున్న అధికారుల తీరుపై తిరుగుబాటు జెండా ఎగుర వేశాడు.

అసహనం కోల్పోయి సంబంధిత అధికారిపై కాన్షీరామ్ చేయిచేసుకున్నాడు. ఈ రెండు సంఘటనలు కాన్షీరామ్ జీవితాన్ని మలుపు తిపాయి. సాంఘీక అసమానతలకు వ్యతిరేకంగా సమాతా రాజ్యస్థాపనకు పూలే, అంబేద్కర్ కన్న కలల్ని సాకారం చేయడం కోసం దీర్ఘకాలిక ప్రణాళికలతో రంగంలోకి దిగాడు కాన్షీరామ్. సమాజంలో మైనార్టీలుగా ఉన్న 15శాతం అగ్రకులాలు, 85 శాతంగా ఉన్న బడుగు బలహీన కులాలను ఏకం చేసి రాజ్యాధికార దిశగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నాడు. బహుజనుల బతుకులను మార్చాలంటే దీర్ఘకాలిక ఉద్యమం అవసరం అని నిర్ధారించుకున్న కాన్షీరామ్ తల్లిదండ్రులకు సుదీర్ఘరమైన ఉత్తరం రాసి తాను బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం.... ఉద్యమాన్ని కొనసాగించాలని నిర్ణయించుకొని ఇకమీదట ఇల్లు, కుటుంబం వదిలేస్తున్నాననీ ప్రకటించారు. ఆ నిర్ణయం మీద కఠినంగా నిలబడిన కాన్షీరామ్ 1983 లో తండ్రి మరణించినా అంత్యక్రియలకు ఇంటి వైపు వెళ్లలేదు. 1964లో ఉన్నత ఉద్యోగాన్ని వదిలేసిన కాన్షీరామ్ మిత్రులు మనోహర్ అటే, డికే ఖపార్డే, శ్రీగైనీ, తంబాఖే, మధపరిహార్, భీమ్రావు దళాళ్ వంటి వారితో కలిసి పూనా

కేంద్రంగా మహారాష్ట్ర అంతటా ఉద్యోగులను కలుసుకుంటూ తిరగడం ప్రారంభించాడు. ఎంతో మంది ఎన్ని విధాలా కామెంట్లు, విమర్శలు చేసినా పట్టించుకోకుండా తిరిగాడు. 1965 నుంచి 1971 వరకు రిపబ్లికన్ పార్టీ పునర్నిర్మాణం కోసం నిర్విరామంగా కృషి చేశారు. బామ్ సెఫ్ ఉద్యమాన్ని విస్తరించటంలో భాగంగా 1979లో ఢిల్లీలో అంబేద్కరిజం పునరుజ్జీవనం పొంది మనగలుగుతుందా అనే అంశం మీద సెమినార్లు నిర్వహించి చర్చలేవనెత్తారు. 1980లో అంబేద్కర్ మేళా రథయాత్ర ద్వారా దాదాపు 9 రాష్ట్రాల్లో 34 పట్టణాల్లో విస్తృతంగా సిద్ధాంత ప్రచారం చేశాడు. 1982లో పరిమిత రాజకీయ కార్యచరణలో భాగంగా హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో డీఎస్-4 ద్వారా ఏకంగా 42మంది అభ్యర్థులను బరిలో దించారు. మొత్తం పొలైన ఓట్లలో 1.19శాతం ఓట్లను సాధించి డీఎస్-4 అభ్యర్థులు సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ (ఎస్) వంటి జాతీయ పార్టీల కన్నా ఎక్కువ ఓట్లు సాధించి తమ ఉనికి చాటుకున్నారు.

హర్యానా ఎన్నికల తర్వాత మన ఓటు మనకే వేసుకోవాలనీ, మన టికెట్ మనమే ఇచ్చుకోవాలనీ వచ్చిన చైతన్యం స్పృహను ఆచరణ రూపంలోకి మార్చాలని కాన్షీరాం నిర్ణయించారు. రాజకీయ పార్టీ ఆవశ్యకతను గుర్తించి కాన్షీరామ్ బామ్సెఫ్, డీఎస్-4 కార్యకర్తలు, వివిధ ప్రజా సంఘాలు, అభిమానుల సమక్షంలో 1984 ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజు 'బహుజన్ సమాజ్ పార్టీ'ని ఏర్పాటు చేశారు. బహుజన సమాజ్ పార్టీ రూపొందించిన నినాదాలు అగ్రకుల పాలక వర్గాల పార్టీల్లో భయాన్ని.. బహుజన సమాజ్ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపాయి.' సంసద్ ఛలో అప్నేపైరోంపర్ ఛలో' (పార్లమెంటుకునడు. నీకాళ్ల మీద నువ్వునడు). ఓటు హమారా, రాజ్ తుమారా, నహీచలేగా, నహిచలేగా (ఓట్లు మావి, సీట్లు మీవా–ఇకపై చెల్లదు, ఇకపై చెల్లదు) 'బాబా తేరా మిషన్ అధూరా కాన్షీరామ్ కరేగాపూరా ' (బాబా నీవు వదిలి వెళ్లిన కర్తవ్య స్ఫూర్తి కాన్షీరామ్ చేస్తాడు పూర్తి) జో జమీన్ సర్కారీహై ఓ జమీన్ హమారీ హై (ఏ భూమి ప్రభుత్వందో ఆభూమి మనదే) వంటి చైతన్య పూరిత నినాదాలు... అక్షరం తెలియని బహుజన సమాజంలో పదునైన ఆయుధాలుగా నిలిచి ప్రజల్లో చైతన్యాన్ని ...పాలక వర్గాల్లో అలజడులను సృష్టింపజేశాడు కాన్షీరామ్. ఎవరెంత మందో వారి కంత వాటా అన్న సిద్ధాంతాన్ని ఆచరణాత్మకంగా ... ప్రయోగాత్మకంగా నిరూపించిన వ్యక్తి కాన్షీరామ్. బహుజన రాజ్యాన్ని భారత దేశం మొత్తం సాకారం చేయడం కోసం తన ఆఖరి క్షణం వరకు పరితపించిన గోప్పయోధుడు కాన్షీరామ్. అర్ధాంతరంగా అనారోగ్యానికి గురైనాడు. లక్నోలో 2003 ఆగస్టు 25న ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చివరిగా కాన్షీరామ్ అనారోగ్యంతో బాధపడుతూ కూడా కార్యకర్తల సహకారంతో వేదికపైకి వచ్చి సందేశం ఇచ్చాడు. ఆ సభలో కాన్షీరామ్ మాట్లాడుతూ మనువాద వ్యవస్థను మార్చి సమకాలీన భారత దేశంలో బహుజనుల ఆత్మగౌవరం.... సమానత్వం... సమధర్మం కోసం మహాత్మాజ్యోతిభా పూలే, సాహుమహరాజ్, పెరియార్, నారాయణగురు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిరంతరం కృషి చేశారని వారి జీవితం సరిపోలేదన్నారు. నేను ఈ సమాజాన్ని మార్చటానికి నా జీవిత కాలమంతా మీ ముందు ఉండి కృషి చేశాను...నా జీవితం సరిపోలేదు. కానీ మీ అందరిని తయారు చేశాను, మీరే ఈ ఉద్యమవారసులు, మీ మీదే ఈ బాధ్యత ఉంచుతున్నాను... ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎదిరించి ముందుకే వెళ్లండి అంటూ సందేశం ఇచ్చారు కాన్షీరామ్. రెండున్నర సంవత్సరాల పాటు వైద్యనిపుణుల పర్యవేక్షణలో చికిత్సపొందుతూ కోమాలేనే గడిపారు. కోల్పోయిన హక్కులను బహుజన సమాజం కోసం తిరిగి సాధించడానికి జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత మనవాతా మూర్తి కాన్షీరామ్ 2006 అక్టోబర్ 9 రాత్రి ఈ లోకాన్ని విడిచి వెళ్లారు.



ఇ. చంద్రశేఖర్
సీనియర్ జర్నలిస్ట్.
98488 22333.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com